# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 12 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల గురువారం 17 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 12 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA THU 17 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## లక్ష్యాలు చేరకపోతే ఈ సమావేశాలెందుకు?

### ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చంద్రబాబు

- 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం
- అన్ని వర్గాలను బలోపేతం చేసేలా రుణాలు అందించాలని బ్యాంకర్లకు చంద్రబాబు సూచన
- రుణాల మంజూరులో కొన్ని బ్యాంకులు వెనుకబడటంపై సీఎం అసంతృప్తి
- రుణాల చెల్లింపులో ఎస్హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 అని ప్రశంస
- పీఎం సూర్యఘర్ పథకానికి పెద్దఎత్తున రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- కౌలు రైతులకు రుణసాయం పెంచాలని బ్యాంకులకు దిశానిర్దేశం




**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలోని అన్ని రంగాలను, వర్గాలను బలోపేతం చేసేలా రుణాలను అందించాలని, లక్ష్యాలను చేరుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. అమరావతిలో బుధవారం జరిగిన 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన పాల్గొని, వివిధ అంశాలపై అధికారులకు, బ్యాంకర్లకు కీలక దిశానిర్దేశం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేనప్పుడు ఇలాంటి సమావేశాలు నిర్వహించి ప్రయోజనం ఏముంటుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రుణాల మొత్తం గతంతో పోలిస్తే పెరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో మంజూరు జరగలేదు. కొన్ని బ్యాంకులు ఇంకా వెనుకబడే ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి" అని అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యం ఉందని, ఇందుకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు అందించి సహకరించాలని కోరారు.స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. "రుణాలు తీసుకున్న వారిలో 99 శాతానికి పైగా మహిళలు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు. ఈ విషయంలో ఏపీ ఎస్‌హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలిచారు. కేవలం 0.67 శాతం మంది మాత్రమే చెల్లింపుల్లో విఫలమవుతున్నారు. వీరి నుంచి బకాయిలు వసూలు చేసేందుకు 'వన్ టైమ్ సెటిల్‌మెంట్' (ఓటీఎస్) విధానంపై ఆలోచించాలని బ్యాంకులకు సూచిస్తున్నాను" అని వివరించారు. రాష్ట్రంలో 15 శాతం ఆర్థిక వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ఎల్‌నినో కారణంగా కొంత ఇబ్బందికర పరిస్థితి తలెత్తిందని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రతికూలతలను అధిగమించి ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాష్ట్ర వ్యవసాయ రంగంలో కీలకమైన కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేందుకు బ్యాంకులు చొరవ చూపాలని ఆయన కోరారు.

## తిరుమలలో హైటెక్ ఆధ్యాత్మికత.. మ్యూజియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు..

- తిరుమలను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక నమూనాగా తీర్చిదిద్దుతామన్న సీఎం
- రూ.104 కోట్లతో ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం 32 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి
- తిరుమల వచ్చే ప్రతి భక్తుడికి రూ.2 లక్షల బీమా సౌకర్యం
- రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం

2లో



## ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు.. ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?

- చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- ఎఫ్‌బీఐగా నటిస్తూ ఏపీ పోలీసులు సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని కోరారని వెల్లడి
- ఇది ప్రభుత్వ ప్రాయోజిత మోసమంటూ జగన్ విమర్శ
- ఈ చర్యతో ఏపీ పరువు తీశారంటూ మండిపడ్డ మాజీ సీఎం
- హామీల అమలుపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి హితవు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చంద్రబాబు గారి రెడ్ బుక్

- మిగతా 2లో






## స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే చంద్రబాబు సంక్షేమ డ్రామా ఆడుతున్నారని వైసీపీ విమర్శ
- కొత్త ప్రభుత్వం వచ్చాక అర్హులకు పెన్షన్లు ఇవ్వడం లేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపణ
- దాదాపు 6 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులను తొలగించారని విమర్శ
- జగన్ తెచ్చిన జీవోతోనే అసైన్డ్ భూములకు హక్కులు దక్కుతున్నాయని వెల్లడి
- కేంద్రం కేటాయించిన ఇళ్లు నామమాత్రమేనని వ్యాఖ్య

- మిగతా 2లో

## వివేకా హత్య కేసు నిందితులకు సీబీఐ కోర్టులో ఎదురుదెబ్బ

- డిశ్చార్జ్ పిటిషన్లు వేసిన గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి
- పిటిషన్లకు విచారణార్హత లేదన్న కోర్టు
- నిందితులపై అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో నాంపల్లిలోని ప్రత్యేక సీబీఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. తమపై నమోదైన తీవ్ర అభియోగాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ ప్రధాన నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లను న్యాయస్థానం నిర్ద్వంద్వంగా

- మిగతా 2లో





## జీరం ఘాటీ నరమేధం కేసులో చారిత్రక తీర్పు..

## 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష

- 2013లో కాంగ్రెస్ పార్టీ పరివర్తన్ యాత్రపై దాడి
- మావోల దాడిలో 29 మంది దుర్మరణం
- 10 మంది మావోలకు ఉరిశిక్ష విధించిన ఎన్ఐఏ న్యాయస్థానం

**పెన్ పవర్ డెస్క్:**ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జీరం ఘాటీ వద్ద 2013లో కాంగ్రెస్ 'పరివర్తన్ యాత్ర' కాన్వాయ్‌పై దాడి చేసిన మావోయిస్టులు 29 మందిని అతి దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ దాడి కేసులో జగదల్‌పూర్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన మొత్తం 10 మంది మావోయిస్టులకు

- మిగతా 2లో

## ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన

- ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- శనివారం సాయంత్రానికి అల్పపీడనం ఏర్పాటుకు సూచనలు
- ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశం
- ప్రభావంతో వచ్చే వారం రాష్ట్రంలో వర్షాలు కురిసే ఛాన్స్
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిక వెల్లడి

- మిగతా 2లో







## భార్య ముక్కు కొరికేసిన భర్త... మంచిర్యాలలో దారుణం

- భార్య ముక్కు కొరికేసిన భర్త
- మంచిర్యాల జిల్లాలో జరిగిన దారుణ ఘటన
- కాపురానికి రావడం లేదన్న కోపంతో భర్త దాడి
- అడ్డువచ్చిన మామపై కూడా కర్రతో దాడి
- వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి బాధితురాలు తరలింపు

- మిగతా 2లో



## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..

### నెల్లూరులో ఆధునిక పాఠశాలలను ప్రారంభించిన మంత్రి లోకేశ్

- నెల్లూరులో ఆధునికీకరించిన ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ ప్రభుత్వ స్కూళ్లను ప్రారంభించిన మంత్రి
- వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆర్ఎస్ఆర్ స్కూల్‌కు కార్పొరేట్ హంగులు
- డిజిటల్ తరగతులు, రోబోటిక్స్ ల్యాబ్, సింథటిక్ క్రీడా ప్రాంగణం వంటి ప్రత్యేకతలు
- పాఠశాల పనితీరుపై సమీక్ష.. ఉత్తీర్ణత శాతం పెంచాలని అధికారులకు లోకేశ్ ఆదేశం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఇతర టీడీపీ నేతలు

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా నెల్లూరు నగరంలో మరో ముందడుగు పడింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో

- మిగతా 2లో

## సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు



- కేంద్ర విమోచన వేడుకలకు అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరణ
- రాష్ట్రంలో 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహణ
- సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వేడుకలు

- మిగతా 2లో

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

**పెన్ పవర్ డెస్క్:** సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# రావాలి అవంతి అంటున్న వైసీపీ !

నాకొద్దీ పార్టీ అని మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు ఇప్పటికి రెండేళ్ళ క్రితం వైసీపీని వీడిపోయారు. చిత్రంగా ఇపుడు వైసీపీకి ఆయనే అవసరం అవుతున్నారు అని అంటున్నారు. భీమునిపట్నం వైసీపీ ఇంచార్జిగా ఉన్న చిన్న శ్రీను టీడీపీలో చేరిపోయారు. ఆయన పార్టీని వీడి పది రోజులకు దగ్గర పడుతున్నా భీమిలీ వైసీపీ ఇంచార్జిగా ఎవరిని ఎంపిక చేయాలో తెలియక ఆ పార్టీ సతమతం అవుతోంది. వైసీపీకి భీమిలీ ఇపుడు అతి పెద్ద పరీక్ష పెడుతోంది. విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడిని, అలాగే నెల్లిమర్ల వైసీపీ ఇంచార్జిని వెంటనే నియమించిన వైసీపీ అధినాయకత్వం భీమిలీ విషయంలో మాత్రం ఏమీ పాలుపోక ఆగిపోయిందా అన్న చర్చ వస్తోంది. ఎందుకంటే భీమిలీ టీడీపీకి కంచుకోట. అక్కడ వైసీపీని నడపడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకే అర్ధబలం అంగబలం ఉన్న నేతల కోసం పార్టీ చూస్తోంది.

**వైసీపీ సర్వేలో ఆయనే :**

ఇదిలా ఉంటే భీమిలీ నియోజకవర్గానికి కొత్త వైసీపీ ఇంచార్జిగా ఎవరిని నియమించాలి అన్న దాని మీద పార్టీ అంతర్గత సర్వే నిర్వహిస్తే మెజారిటీ క్యాడర్ తో పాటు నాయకులు అంతా అవంతికి జై కొట్టారని తెలుస్తోంది. అవంతి 2019 నుంచి 2024 మధ్యలో వైసీపీలో ఎమ్మెల్యేగా మంత్రిగా పనిచేశారు. విశాఖ వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా ఆయన ఉన్నారు. ఆయన బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పాటు అంగబలం అర్ధ బలానికి లోటు లేదు. ఇక 2009లో ప్రజా రాజ్యం నుంచి ఒకసారి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అలా ఆయనకంటూ సొంత బలం అనుచర గణం ఉంది. అందువల్ల ఆయనకే పార్టీ బాధ్యతలు అప్పగిస్తే భీమిలీలో కూటమిని ధీటుగా ఎదుర్కొంటారు అని అంటున్నారు. ఇది భీమిలీ మెజారిటీ వైసీపీ నేతల మాటగా ఉంది.

**ఇంతకీ ఆయన వస్తారా :**

అయితే ఇదంతా ఒంటి చేతి చప్పుడు మాదిరిగానే ఉంది అంటున్నారు. వైసీపీ తన సర్వేలు తాను చేస్తోంది. అందులో అవంతి పేరు కూడా జోడించింది. అందరూ అవంతి కావాలని కోరుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది కానీ ఇంతకీ అవంతి శ్రీనివాసరావు వైసీపీలోకి తిరిగి చేరుతారా అన్నదే పెద్ద చర్చగా ఉంది. ఆయన 2024 డిసెంబర్ లో వైసీపీకి రాజీనామా చేశారు. అప్పట్లో ఆయన ఆలోచనలు కూటమిలో చేరాలని. అందుకే వైసీపీ మేయర్ ని దించడానికి కార్పోరేటర్ గా ఉన్న తన కుమార్తె చేత కూడా వైసీపీకి వ్యతిరేకంగా ఓటేయించి టీడీపీ కూటమికి జీవీఎంసీ దక్కేలా చేశారు. అయితే టీడీపీలో ఆయన రాకను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వ్యతిరేకించడంతో ఆగింది అని అంటున్నారు.

**తగిన మూల్యం చెల్లిస్తోంది :**

జనసేనలో ఆయనను చేర్చుకోవడానికి కూడా స్థానికంగా అంగీకారం లేదని చెబుతున్నారు. ఈ కారణాల వల్లనే ఆయన ప్రస్తుతం ఖాళీగా ఉన్నారు అని అంటున్నారు. డీలిమిటేషన్ మీద అవంతి ఆశలు పెట్టుకున్నారు. సీట్లు పెరిగితే కనుక కూటమి పార్టీలలో చేరి మళ్ళీ పోటీ చేయాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో అవంతి వైసీపీలో చేరుతారు అన్నది ఎంతవరకూ జరుగుతుంది అన్నది పెద్ద ప్రశ్నగా ఉంది. ఒకవేళ మనసు మార్చుకుని అవంతి వైసీపీలో చేరితే మాత్రం వైసీపీకి గండం గట్టెక్కినట్లే అంటున్నారు. మొత్తానికి చూస్తే గతంలో వైసీపీలో ఎంతో మంది నాయకులు ఉన్నారు. కానీ ఎన్నికల వేళ వారిని అందరినీ దూరం చేసుకున్న పాపానికి ఇపుడు వైసీపీ తగిన మూల్యం చెల్లిస్తోంది అని అంటున్నారు.

## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..

- మొదటి పేజి తరువాయి

అత్యంత ఆధునికంగా అభివృద్ధి చేసిన రెండు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన నెల్లూరు చేరుకోగా, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహా పలువురు జిల్లా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ముందుగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చెందిన వీపీఆర్ ఫౌండేషన్ అందించిన రూ.8.3 కోట్ల ఆర్థిక సహకారంతో సమూలంగా ఆధునికీకరించిన ఆర్.ఎస్.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నూతన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

**కార్పొరేట్ హంగులతో ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్**

వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఈ పాఠశాలలో మొత్తం 43 తరగతి గదులను అందుబాటులోకి తెచ్చారు. డిజిటల్ బోధన కోసం ప్రతి గదిలో ఎల్‌ఈడీ స్క్రీన్లు, ఆధునిక బెంచీలు ఏర్పాటు చేశారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు ప్రయోగాత్మక, సాంకేతిక విద్య అందించేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లను సిద్ధం చేశారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేయడం విశేషం. చదువుతో పాటు క్రీడలకు కూడా పెద్దపీట వేస్తూ పాఠశాలలో ఎకరం విస్తీర్ణంలో విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టును, అవుట్‌డోర్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం మూలపేట 39వ డివిజన్‌లో రూ.13.4 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో ఆధునికీకరించిన దేవిరెడ్డి శారద (డీఎస్‌ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను కూడా లోకేశ్ ప్రారంభించారు.

**ఫలితాలపై దృష్టి పెట్టండి: మంత్రి లోకేశ్**

పాఠశాలల ప్రారంభోత్సవం అనంతరం, ఆర్.ఎస్.ఆర్. పాఠశాల పనితీరుపై ప్రధానోపాధ్యాయుడు, ఇతర అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. కేవలం భవనాలు నిర్మిస్తే సరిపోదని, విద్యా ప్రమాణాలు, ఫలితాలు కూడా మెరుగుపడాలని స్పష్టం చేశారు. గతేడాది పదో తరగతిలో కేవలం 60.19 శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు, ఎన్‌రోల్‌మెంట్ ఎందుకు తగ్గుతున్నాయని ఆరా తీశారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.షరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు.. ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?

- మొదటి పేజి తరువాయి

పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

"చంద్రబాబు గారూ, ఇది పోలీసింగా? లేక రాజకీయ వేధింపుల కోసం చేస్తున్న ప్రభుత్వ ప్రాయోజిత మోసమా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించేందుకు ఏపీ పోలీసులే తమ అధికారిక ఈమెయిల్ నుంచి 'ఎక్స్'కు అభ్యర్థన పంపారని, కానీ అభ్యర్థన పంపిన సంస్థ పేరుగా 'ఎఫ్‌బీఐ'ని పేర్కొన్నారని 'ఎక్స్' సంస్థే ధ్రువీకరించింది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఎఫ్‌బీఐ పేరును ఎందుకు దుర్వినియోగం చేశారు?" అంటూ జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల వైఫల్యం, డీఎస్సీ స్కామ్, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికే ఈ కుట్ర చేశారా? అని ఆయన నిలదీశారు. పోలీసు యూనిఫాం చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించిందని, రాజకీయ సెన్సార్‌షిప్ కోసం కాదని హితవు పలికారు. ఈ చర్య ద్వారా విదేశీ దర్యాప్తు సంస్థ పేరును రాజకీయాల్లోకి లాగి ఆంధ్రప్రదేశ్ పరువును తీశారని, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శకుల గొంతు నొక్కేందుకు వెచ్చిస్తున్న శక్తిని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలుపై పెట్టాలని జగన్ సూచించారు. కరవుతో ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవడం, ఉద్యోగాలు సృష్టించడం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టడం వంటి పనులు చేయాలన్నారు. ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్‌తో కాకుండా పనితీరు, పారదర్శకతతో సమాధానం చెప్పాలని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## తిరుమలలో హైటెక్ ఆధ్యాత్మికత.. మ్యూజియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు..

తిరుమలను ప్రపంచస్థాయి పవిత్ర దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ఓ గొప్ప నమూనాగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతను ఆధ్యాత్మికతతో సమన్వయం చేస్తూ భక్తులకు అద్భుతమైన అనుభూతిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా, బుధవారం తిరుమలలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రూ.104 కోట్ల భారీ వ్యయంతో టీసీఎస్ ట్రస్ట్ ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియంతో పాటు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన 'పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను ఆయన భక్తులకు అంకితం చేశారు. భక్తులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను తీర్చిదిద్దారు. ఇందులో శ్రీవారికి జరిగే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలతో పాటు తిరుమల క్షేత్రంలోని వివిధ ప్రాంతాలను 3డీ సాంకేతికత ద్వారా కళ్లారా వీక్షించే అవకాశం కల్పించారు. 6డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా శ్రీవారి దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా స్వీకరించి, ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం, ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియాన్ని సీఎం ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీనివాసుని కల్యాణ ఘట్టం వంటి విశేషాలను భక్తులకు సులభంగా అర్థమయ్యేలా ఇందులో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణదేవరాయలు వంటి మహారాజులు స్వామివారికి సమర్పించిన ఆభరణాల 3డీ నమూనాలు, చారిత్రక వస్తువులు, స్వామివారి కిరీటాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పానోరమిక్ స్క్రీన్‌పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో రూపొందించిన శ్రీవారి పరిణయ వీడియోను ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. ఆనాటి సంగీత విద్వాంసులు వాడిన వాయిద్య పరికరాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మరికొన్ని కీలక ప్రకటనలు చేశారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికి ఎల్ఐసీ భాగస్వామ్యంతో ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. దీని ద్వారా తిరుమలలో దురదృష్టవశాత్తూ భక్తుడు మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల నుంచి కూడా ఆలయ నిర్మాణానికి విజ్ఞప్తులు వస్తున్నాయని చెప్పారు. అనంతరం, తిరుమలలో భక్తుల సౌకర్యార్థం రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. నారాయణగిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, దాతల ప్రతినిధులు సుచిత్రా ఎల్లా, నితిన్ సేత్‌లతో కలిసి ఆయన ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణించారు. తిరుమలలో పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే కొండపై 89.5 శాతం పచ్చదనం ఉందని గుర్తుచేశారు. ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణ, సేవ, ఆధునిక సాంకేతికత వంటి ఆరు కీలక అంశాల ప్రాతిపదికన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి వివరించారు.

## ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనువైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం (సెప్టెంబర్ 19) సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

ఈ అల్పపీడనం రాబోయే 3-4 రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడనుందని అధికారులు తెలిపారు. అనంతరం ఇది దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ అల్పపీడనం ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు

ప్రజలకు తెలియజేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని అధికారులు కోరారు.

## సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు

హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సీఏపీఎఫ్ బలగాల పరేడ్‌ను పరిశీలించనున్నారు. గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహిస్తోంది.

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ రోజును ఏ పేరుతో నిర్వహించాలన్న దానిపై తెలంగాణలో కొన్నేళ్లుగా రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, 2023లో 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నుంచి 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా వేడుకలు నిర్వహిస్తోంది.

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

- మొదటి పేజి తరువాయి

అలముకున్నాయి. గ్రామంలోని వినాయక విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడిపోయారు. వెంటనే స్పందించిన గ్రామస్థులు.. గల్లంతైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతులను నరసింహ(21), తేజ(17), సిద్దార్థ(17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు.

**ఘటనపై మంత్రి పొన్నం తీవ్ర దిగ్భ్రాంతి**

గణేశ్ నిమజ్జనం సందర్భంగా శిరీష ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతి తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. సహాయక చర్యలు, ఘటనకు సంబంధించిన పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు, పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు నీటిలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రమాదకరమైన, లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రజలు అక్కడికి వెళ్లకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## వివేకా హత్య కేసు నిందితులకు సీబీఐ కోర్టులో ఎదురుదెబ్బ

- మొదటి పేజి తరువాయి

కొట్టివేసింది. కేసులో ఏ1 ఎర్ర గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్ రెడ్డి, ఏ6 గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు డిశ్చార్జ్ పిటిషన్లను సమగ్రంగా విచారించిన కోర్టు, వాటికి ఎలాంటి విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్లు, సాంకేతిక ఆధారాలు, సమర్పించిన సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... నిందితులపై ఉన్న అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టం చేసింది.

## స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలపై బూటకపు ప్రచారం చేస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం, జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ఇప్పుడు ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరించి మహిళలు, రైతులు, యువత సహా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ అవే హామీలను వల్లె వేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బలహీన వర్గాలకు, మహిళలకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయలేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరు చేసిన తేదీ నుంచి కాకుండా, బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు తమ పింఛన్ల దరఖాస్తుల ఆమోదం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జగన్ హయాంలో వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు అందేవని, చంద్రబాబు ఆ సమర్థవంతమైన వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏదో ఒక సాకు చూపి లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తున్నారని, జగన్ హయాంలో దాదాపు 69 లక్షల మందికి పింఛన్లు అందగా, చంద్రబాబు ప్రభుత్వం సుమారు ఆరు లక్షల మందిని తొలగించిందని ఆరోపించారు. ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి లేమిని స్పష్టం చేస్తోందన్నారు. అసైన్డ్ భూములపై చంద్రబాబు చేస్తున్న ప్రచారాన్ని శ్రీకాంత్ రెడ్డి తప్పుదోవ పట్టించే చర్యగా అభివర్ణించారు. పదేళ్లుగా వివాదాస్పద అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న వారికి పట్టా హక్కులు కల్పించే జీవోను జగన్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ భూములను ఫ్రీహోల్డ్ ఆస్తులుగా మార్చడం ఆ జీవో ఫలితమేనని, కానీ దీనిని తమ ఘనతగా చెప్పుకుంటూ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ంరాష్ట్రానికి 5 లక్షల ఇళ్లు కేటాయించామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పడంపై స్పందిస్తూ.. జగన్ ప్రభుత్వం మహిళల పేరు మీద పంపిణీ చేసిన 30 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలతో పోలిస్తే ఇది చాలా తక్కువని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

## భార్య ముక్కు కొరికేసిన భర్త... మంచిర్యాలలో దారుణం

తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో ఓ కిరాతక ఘటన వెలుగుచూసింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో ఆగ్రహానికి లోనైన భర్తే, భార్య ముక్కు కొరికి తీవ్రంగా గాయపరిచాడు. ఈ అమానుష ఘటన బుధవారం కొటపల్లి మండలంలో చోటుచేసుకుంది. మణిచందర్, మమత దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరగగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా మమత తన పుట్టింట్లోనే నివసిస్తోంది. ఈ క్రమంలో భార్యను తిరిగి తన వెంట తీసుకెళ్లేందుకు మణిచందర్ నేడు అత్తవారింటికి వెళ్లాడు. అయితే మమతను పంపేందుకు ఆమె తండ్రి నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన మణిచందర్ తన మామపై కర్రతో దాడి చేశాడు. భర్తను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మమతపై కూడా అతను విచక్షణారహితంగా దాడి చేసి, ఆమె ముక్కును కొరికేశాడు. ఈ ఘటనలో బాధితురాలి ముక్కు భాగం తీవ్రంగా దెబ్బతింది. స్థానికులు వెంటనే స్పందించి బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను వరంగల్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జీరం ఘాటీ నరమేధం కేసులో చారిత్రక తీర్పు.. 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష

- మొదటి పేజి తరువాయి

మరణశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2013లో జీరం ఘాటీ అటవీ ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా మావోయిస్టులు జరిపిన ఆకస్మిక దాడిలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అగ్రనాయకత్వం తుడుచుపెట్టుకుపోయింది. ఈ దారుణ నరమేధంలో కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, నాటి పీసీసీ అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్, 'సల్వా జుడుం' వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మా సహా మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. దోషులపై భారత శిక్షా స్మృతిలోని హత్య, కుట్ర సెక్షన్లతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎన్ఐఏ కోర్టు ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. భారత రాజకీయ మరియు భద్రతా చరిత్రలో చోటుచేసుకున్న అతిపెద్ద తీవ్రవాద దాడుల్లో ఒకటైన ఈ కేసులో 13 ఏళ్ల తర్వాత బాధితుల కుటుంబాలకు న్యాయం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఎండల దృష్ట్యా సచివాలయాల వద్ద మంచినీటి సౌకర్యం



**– ప్రజల విజ్ఞప్తి మేరకు సచివాలయం1, సచివాలయం2 వద్ద చేతి పంపుల ఏర్పాటు**

**– ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, టీడీపీ అధికార ప్రతినిధి మహేందర్‌నాథ్ సూచనలతో చర్యలు**

**వేటపాలెం, సెప్టెంబర్ 16, (పెన్ పవర్) :**
ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో సచివాలయాలకు వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించే ఉద్దేశంతో చల్లారెడ్డిపాలెంలో రెండు మంచినీటి చేతి పంపులను ఏర్పాటు చేశారు. చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, చీరాల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ మద్దులూరి మహేందర్‌నాథ్ సూచనల మేరకు ప్రజల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ సౌకర్యాన్ని కల్పించారు.చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని సచివాలయం1తో పాటు జబ్బార్ కాలనీ వద్ద ఉన్న సచివాలయం2 వద్ద చేతి పంపులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని చల్లారెడ్డిపాలెం పంచాయతీ టీడీపీ పార్టీ అధ్యక్షుడు కీర్తి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో చేపట్టారు.సచివాలయాలకు వచ్చే ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# 2025 ఉత్తమ జర్నలిస్టు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

## పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్

**విజయవాడ, పెన్ పవర్ సెప్టెంబరు 16:**
జర్నలిజం రంగంలో విశేష సేవలందిస్తూ వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పాత్రికేయులను ప్రోత్సహించి, వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్సరానికి 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ తెలిపారు.
దరఖాస్తులను సెప్టెంబరు 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా డైరెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ, 2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ520013 చిరునామాకు పంపించాలి.

<u>ప్రధాన అవార్డులు.. నగదు పురస్కారాలు</u>
కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు రూ.2 లక్షల నగదు పురస్కారం అందజేస్తారు. ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు విభాగంలో ఖాసా సుబ్బారావు, ముట్నూరి కృష్ణారావు, మద్దుకూరి చంద్రశేఖరరావు పేర్లతో మూడు అవార్డులు అందించనున్నారు. ఒక్కో అవార్డుకు రూ.లక్ష చొప్పున నగదు పురస్కారం ఉంటుంది.
సావిత్రిబాయి పూలే ఉత్తమ మహిళా జర్నలిస్టు, ఉత్తమ కార్టూనిస్టు, అబుల్ కలాం ఆజాద్ ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు, ఉత్తమ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు, ఉత్తమ వీడియో జర్నలిస్టు అవార్డులకు కూడా రూ.లక్ష చొప్పున నగదు పురస్కారం అందజేస్తారు.
వి.ఆర్. నార్ల జీవిత సాఫల్య పురస్కారం, కొక్కు అహోబలరావు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డు, మద్దూరి అన్నపూర్ణయ్య పేరిట చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంపాదకులకు అందించే అవార్డులకు ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించరు. ఎంపిక కమిటీ తన విచక్షణాధికారంతో ఈ పురస్కార గ్రహీతలను ఎంపిక చేస్తుంది.

<u>2025లో ప్రచురితమైన కథనాలు తప్పనిసరి</u>
దరఖాస్తుదారులు తమ సంస్థ, ఉద్యోగం, అర్హతలకు సంబంధించిన పూర్తి వివరాలతో వ్యక్తిగతంగా దరఖాస్తు చేయాలి. దరఖాస్తుతో పాటు 2025 జనవరి 1 నుంచి డిసెంబరు 31 మధ్య ప్రచురితమైన లేదా ప్రసారమైన కనీసం ఐదు వ్యాసాలు, వార్తా కథనాలు, ఫొటోలు, కార్టూన్లు లేదా



వీడియో క్లిప్పింగులను జతచేయాలి. వీటిని ఫొటోకాపీల రూపంలో కూడా సమర్పించవచ్చు.
అవార్డుల ఎంపికలో ఎంపిక కమిటీదే తుది నిర్ణయమని, తగిన సంఖ్యలో లేదా ప్రమాణాలతో దరఖాస్తులు అందకపోతే సంబంధిత అవార్డును ప్రకటించకుండా నిలిపివేసే అధికారం కమిటీకి ఉంటుందని అధికారులు తెలిపారు.

# కొల్లిపరలో నేడు ఒక నెల ఒక నియోజకవర్గం

## నాలుగుసందర్శనలు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 16:**
ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన 'ఒక నెలఒక నియోజకవర్గంనాలుగు సందర్శనలు' కార్యక్రమం గురువారం కొల్లిపరలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు.కొల్లిపరలోని జగన్నాథ స్వామి ఆలయం ఎదురుగా గురువారం ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, స్థానిక శాసన సభ్యులు నాదెండ్ల మనోహర్‌తో పాటు జిల్లా అధికారులు, నియోజకవర్గ పరిధిలోని మండల అధికారులు పాల్గొంటారని తెలిపారు.ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోసం వినతులు అందజేయవచ్చని కలెక్టర్ సాయికాంత్ వర్మ వెల్లడించారు.



# అగ్ని బాధితులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలి

**– అగ్ని ప్రమాదంలో ఇల్లు, నగదు, సామగ్రి కోల్పోయిన నాగలక్ష్మి కుటుంబానికి ఆర్థిక సాయం**

**– నూతన దుస్తులు పంపిణీ చేసిన ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్**



**బాపట్ల, సెప్టెంబర్ 16, (పెన్ పవర్) :**
అగ్ని ప్రమాద బాధితులను ప్రతి ఒక్కరూ ఆదుకొని మానవత్వాన్ని చాటుకోవాలని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు బండ్రెడ్డి గోపి పిలుపునిచ్చారు. బాపట్ల పట్టణంలోని రైలుపేట 3వ వార్డులో ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదంలో నాగలక్ష్మికి చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. దీంతో కట్టుబట్టలతో రోడ్డున పడిన బాధిత కుటుంబానికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు బుధవారం ఆర్థిక సహాయంతో పాటు నూతన దుస్తులను అందజేశారు.ఈ సందర్భంగా బండ్రెడ్డి గోపి మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధమవడంతో ఇంటి సామగ్రితో పాటు బీరువాలో దాచుకున్న నగదు కూడా కాలిపోయిందని తెలిపారు. పలు నివాసాల్లో కూలి పనులు చేసుకుంటూ ఆడపిల్లలను పెంచుకుంటున్న నాగలక్ష్మి కుటుంబం ఒక్కసారిగా నిరాశ్రయులు కావడం బాధాకరమన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి బత్తుల సురేష్, కోశాధికారి జోగి సువర్ణరాజు, సభ్యులు నరాలశెట్టి నాగరాజు, బండ్రెడ్డి అంకమ్మరావు, కోడిరెక్క రవి, బండి శ్రీనివాసరావు, ఇనుపగొల్ల రంగారావు, యలవల శ్రీనివాసరావు, సుభాని, పెద్దమళ్ళ శ్రీకాంత్, చామర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి భూ సమీకరణను విజయవంతం చేసిన చరిత్ర రైతులదే

# జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 16:**
అమరావతి భూ సమీకరణ విధానాన్ని విజయవంతం చేసిన చరిత్ర రైతులదేనని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అన్నారు. అమరావతి రెండో విడత భూ సమీకరణలో భాగంగా తుళ్ళూరు మండలం హరిశ్చంద్రాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరావతిని ప్రపంచంలోనే ప్రతిష్టాత్మక నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. రెండో విడత భూ సమీకరణకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రైతులందరూ సహకరించాలని కోరారు. అమరావతి రాష్ట్ర పరిపాలనకు కేంద్ర బిందువుగా నిలుస్తుందని తెలిపారు.రైతులు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ వంటి అత్యాధునిక ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. "అందరం కలిసి



రాజధానిని అభివృద్ధి చేసుకుందాం" అంటూ ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపును కలెక్టర్ గుర్తుచేశారు.రైతులు భూ సమీకరణకు భూములను అందిస్తే వెంటనే అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అనంతరం రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ఏ. భార్గవ్ తేజ, రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, తహసీల్దార్ హరిబాబు, సీఆర్‌డీఏ భూ సమీకరణ డిప్యూటీ కలెక్టర్, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**– పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి**

**– ఓజోన్ ఫ్రెండ్లీ పరికరాల వినియోగంతో పర్యావరణాన్ని కాపాడాలి: డాక్టర్ దాసరి చంద్రశేఖర్**

**పర్చూరు, సెప్టెంబర్ 16, (పెన్ పవర్) :**
ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం పర్చూరులోని ఉప్పుటూరు పంచాయతీ కార్యాలయం వద్ద ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. భూమిని సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి రక్షించడంలో ఓజోన్ పొర కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న



వాతావరణ కాలుష్యం కారణంగా ఓజోన్ పొర దెబ్బతినే ప్రమాదం ఉందని, దీని ప్రభావంతో చర్మ క్యాన్సర్, కంటి శుక్లాలు, గుండె, ఊపిరితిత్తుల సమస్యలు పెరిగే అవకాశం ఉందని వివరించారు.ఓజోన్ పొరను పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. క్లోరోఫ్లోరో కార్బన్ల వినియోగం తక్కువగా ఉండే ఓజోన్-ఫ్రెండ్లీ ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లను మాత్రమే కొనుగోలు చేయాలని, వాటిని క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించడం ద్వారా హానికరమైన రసాయనాలు వాతావరణంలోకి విడుదల కాకుండా చూడవచ్చన్నారు.అనవసరంగా వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి వీలైనంత వరకు ప్రజా రవాణా, ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని కోరారు. చెట్లను నరికివేయడం మానేసి విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. పర్యావరణాన్ని సురక్షితంగా ఉంచినప్పుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకురాలు కే. నాగరాజా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారం, నగదు కోసం కన్నతల్లినే హత్య

## మూడు రోజుల్లో కేసు ఛేదించిన పొన్నూరు టౌన్ పోలీసులు




**గుంటూరు, సెప్టెంబర్ 16 (పెన్ పవర్):**
బంగారం, నగదు కోసం కన్నతల్లినే కూతురు తన భర్తతో కలిసి హత్య చేసిన ఘటన పొన్నూరులో కలకలం రేపింది. పొన్నూరు క్యాబిన్‌పేటకు చెందిన ఈపూరు లక్ష్మిని హత్య చేసిన కేసులో ఆమె కుమార్తె పుష్పలత, ఆమె భర్త రాకేశ్‌కుమార్ అలియాస్ రాజును పొన్నూరు టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి బంగారు గొలుసు, రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.తెనాలి డీఎస్పీ జనార్ధనరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పుష్పలతకు తన తల్లి లక్ష్మి వద్ద బంగారం, నగదు ఉన్నట్లు తెలిసింది. వాటిని తీసుకోవాలని కొంతకాలంగా తల్లితో గొడవపడుతూ వచ్చింది. చివరకు భర్త రాకేశ్‌కుమార్‌తో కలిసి లక్ష్మిని హత్య చేసి బంగారం, నగదు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు.ఈ నెల 12న తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో ఇద్దరూ కలిసి లక్ష్మి నోరు నొక్కి, చేతులు, కాళ్లను చీరలతో కట్టి, మరో చీరతో గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె మెడలోని బంగారు గొలుసు, జాకెట్‌లో ఉన్న రూ.5 వేల నగదు, లక్ష్మి మరియు ఆమె కుమారుడి సెల్‌ఫోన్లను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు.ఈ ఘటనను మృతురాలి మనవడు జాషువా ప్రత్యక్షంగా చూసినట్లు పోలీసులు తెలిపారు.గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు తెనాలి డీఎస్పీ జనార్ధనరావు పర్యవేక్షణలో పొన్నూరు టౌన్ సీఐ ఆర్.ఎస్. కిషోర్‌కుమార్, సిబ్బంది సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. నేరం జరిగిన మూడు రోజుల్లోనే నిందితులను అరెస్టు చేసి, చోరీకి గురైన సొత్తును పూర్తిగా రికవరీ చేశారు.కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను అరెస్టు చేసి సొత్తును రికవరీ చేసిన పొన్నూరు టౌన్ సీఐ ఆర్.ఎస్. కిషోర్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

# వైభవంగా టీడీపీ కార్యాలయంలో గణేష్ నిమజ్జనం

**– భక్తిశ్రద్ధలతో పూజలు.. ఘనంగా లడ్డు వేలంపాట**

**– లడ్డూను కైవసం చేసుకున్న నర్రా బ్రహ్మయ్య.. శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలి: మద్దులూరి మహేంద్రనాథ్**

**చీరాల, సెప్టెంబర్ 16, (పెన్ పవర్) :**
చీరాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత గణనాథుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన లడ్డు వేలంపాటలో నర్రా బ్రహ్మయ్య గణేష్ లడ్డూను కైవసం చేసుకున్నారు.నిమజ్జన మహోత్సవంలో చీరాల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి కరుణాకటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.వినాయక చవితి





ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని యువతకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను సంతోషకర వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.






# గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 16:**
రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్ల అమలు జరగాలని కోరుతూ గుంటూరు జిల్లా వ్యాప్తంగా 16 గ్రామాల నుంచి వచ్చిన ఎస్సీ, ఎస్టీ అర్చకులు, హిందూ కార్యకర్తలు జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వినతిపత్రంలో ఎస్సీ రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలను అధికారులు ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వుల క్లాజ్ (3) ప్రకారం ఎస్సీ వర్గానికి సంబంధించిన నిబంధనలను పాటిస్తూ అర్హులైన వారికి మాత్రమే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.క్రైస్తవ మతం స్వీకరించిన వ్యక్తులకు ఎస్సీ రిజర్వేషన్లు వర్తింపజేయరాదని, సంబంధిత చట్టపరమైన నిబంధనలు, న్యాయస్థానాల తీర్పుల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ హిందువులకు న్యాయం జరిగేలా జిల్లా పరిధిలో నిబంధనలను పక్కాగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్‌ను అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరియోజన ప్రముఖ్ గోగినేని వెంకటరమణ, ఎస్సీ, ఎస్టీ దేవాలయ అర్చకులు, హిందూ ఎస్సీ, ఎస్టీ కార్యకర్తలు పాల్గొని జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.గమనిక: ప్రచురణకు ముందు వినతిపత్రంలో పేర్కొన్న 1936 చట్టం, 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు, బీసీ (సి) రిజర్వేషన్ అంశాలకు సంబంధించిన చట్టపరమైన వివరాలను అధికారిక ఆధారాలతో ధృవీకరించండి.

## ఓజోన్ పొర పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన

- చిత్రలేఖన పోటీల్లో 100 మంది విద్యార్థుల ఉత్సాహభరిత పాల్గొనడం
- 'ఓజోన్ పొరను రక్షిద్దాంమానవాళిని కాపాడుదాం' నినాదాలతో గొడుగు ర్యాలీ



**వేటపాలెం, సెప్టెంబర్ 16, (పెన్ పవర్) :**
ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం వేటపాలెం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజినీ మాట్లాడుతూ ఓజోన్ పొర ప్రాముఖ్యత, దాని క్షీణతకు కారణాలు, పరిరక్షణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.'క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్ క్లబ్' అధ్యక్షుడు వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో ఓజోన్ పొర ప్రయోజనాలు, క్షీణత, పరిరక్షణ అంశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించగా సుమారు 100 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం 'ఓజోన్ పొరను రక్షిద్దాంమానవాళిని రక్షిద్దాం', 'ఓజోన్ పొర పరిరక్షణ మనందరి బాధ్యత' అనే నినాదాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు గొడుగు ర్యాలీ నిర్వహించారు.
స్ట్రాటో ఆవరణంలో మూడు ఆక్సిజన్ అణువులతో ఏర్పడిన ఓజోన్‌ను సూచించేలా విద్యార్థులతో 'ఈ' ఆకారంలో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఓజోన్ పొర ప్రాముఖ్యత, క్షీణతకు దారితీసే కారణాలు, పరిరక్షణ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓజోన్ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

- పోస్టర్, స్లోగన్ పోటీలతో చైతన్యం
- ఏడో తరగతి విద్యార్థుల స్కిట్ ప్రదర్శన



**పందిళ్లపల్లి, సెప్టెంబర్ 16, (పెన్ పవర్) :**
అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని పందిళ్లపల్లి జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు శంఖం లలితా పరమేశ్వరి అధ్యక్షతన సైన్స్, సోషల్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి భూమిపై జీవరాశులను ఓజోన్ పొర రక్షిస్తుందని తెలిపారు. ఓజోన్ పొర క్షీణత వల్ల చర్మ క్యాన్సర్, కంటి చూపు సమస్యలు, పంటల నష్టం, వాతావరణ మార్పులు వంటి ప్రతికూల ప్రభావాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఓజోన్‌ను దెబ్బతీసే క్లోరోఫ్లోరో కార్బన్ల వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, ఓజోన్ డే స్లోగన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్లోగన్ పోటీలో సజ్జ హిమశ్రీ, సజ్జా స్నేహశ్రీ, ఎం.చాతుర్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో సజ్జా హిమశ్రీ, డి.ఆశ, ఎం.చాతుర్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. బి.నిరూపమ, కే.దీక్షితలకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఏడో తరగతి విద్యార్థులు ఓజోన్ పరిరక్షణపై స్కిట్ ప్రదర్శించారు.
కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ చెరుకూరి రాంబాబు, స్టాఫ్ సెక్రటరీ ఎన్.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఎన్.రూపకళ, సిహెచ్.భవానీదేవి, రాజా నాగేశ్వరరావు, ఎస్.అంకయ్య, ఎస్.నాగరాణి, వ్యాయామ, వొకేషనల్ ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే చిన్నారుల ఆరోగ్య వికాసం

- అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసం2026 కార్యక్రమం
- చిన్ననాటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పెంపొందించాలి: డా. దాసరి చంద్రశేఖర్



**పర్చూరు, సెప్టెంబర్ 16, (పెన్ పవర్) :**
ఉప్పుటూరు అంగన్వాడీ కేంద్రంలో బుధవారం సీడీపీఓ సుభద్ర నేతృత్వంలో పౌష్టికాహార మాసం2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుభద్ర మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, వివిధ సంక్షేమ పథకాల వివరాలను వివరించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ "మొక్కై వంగనిది మానై వంగునా" అన్నట్లుగా చిన్ననాటి నుంచే పిల్లల ఆరోగ్యం, ఆహారపు అలవాట్లపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పౌష్టికాహారంతో పాటు మంచి విద్యాబుద్ధులు నేర్పితే వారు భవిష్యత్తులో ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తూ సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. అనంతరం చంటి బిడ్డకు అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ దీప, ఎమ్మెల్యేహెచ్‌పీ శృతి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పెనమలూరులో రూ.43 లక్షల రుణాల వ్యవహారం

**డ్వాక్రా సభ్యుల పేర్లతో రుణాలు.. సొంత అవసరాలకు వినియోగించుకున్నారనే ఆరోపణలు**




**పెన్ పవర్ కృష్ణా జిల్లా పెనమలూరు, సెప్టెంబర్ 16:**
పెనమలూరు పరిధిలో డ్వాక్రా సంఘాల సభ్యుల పేర్లతో రూ.43 లక్షలకు పైగా రుణాలు తీసుకుని సొంత అవసరాలకు వినియోగించుకున్నారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంలో డ్వాక్రా సంఘాల వివోగా పనిచేస్తున్న బుక్ పేపర్ మొత్రపు సునీతారాణిపై ఆరోపణలు రావడంతో అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.సునీతారాణి పరిధిలో సుమారు 20 డ్వాక్రా సంఘాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆయా సంఘాల సభ్యులు బ్యాంకు రుణాల కింద చెల్లించిన మొత్తాలను వారి అనుమతి లేకుండా సొంత అవసరాలకు వినియోగించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సభ్యులు తిరిగి బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు వెళ్లిన సమయంలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.దీంతో వివోతో పాటు కొంతమంది సంఘాల నాయకులపై వచ్చిన ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి, వివో సునీతారాణిని అరెస్టు చేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు అధికారుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## 14 రాష్ట్రాల కళాకారుల అద్భుత డిజైన్లకు వేదిక జెడ్‌పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ

**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 16:**
భారతీయ వస్త్ర సంప్రదాయం, కళాత్మకతకు ప్రతీకగా ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో నిలుస్తుందని జెడ్‌పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ అన్నారు. విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పోను బుధవారం ఆమె ప్రారంభించారు.
ఈ సందర్భంగా గద్దె అనూరాధ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచ చేనేత, పట్టు వస్త్ర సంపదకు పుట్టినిల్లుగా నిలిచిందన్నారు. దేశంలోని ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకమైన కాటన్, పట్టు వస్త్ర సంప్రదాయాలు ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతి చీర వెనుక నేతన్నల శ్రమ, కళాత్మకత, తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం దాగి ఉంటుందని తెలిపారు.ఉప్పాడ జాంధాని, బెనారస్ సిల్క్, రాజ్‌కోట్ పటోలా, పోచంపల్లి ఇక్కత్, బెంగళూరు ప్యూర్ క్రేప్ సిల్క్, గద్వాల్ తదితర ప్రసిద్ధ చేనేత, పట్టు వస్త్రాలు భారతీయ నేత కళా వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని అన్నారు. వివిధ రాష్ట్రాలకు వెళ్లకుండానే భారతీయ పట్టు, చేనేత వైవిధ్యాన్ని ఒకే వేదికపై వీక్షించి, నచ్చిన వస్త్రాలను కొనుగోలు చేసేందుకు ఈ ఎక్స్‌పో చక్కటి అవకాశాన్ని కల్పిస్తోందని చెప్పారు.

**చేనేతను ఆదరిద్దాం.. కళాకారుల శ్రమను గౌరవిద్దాం**

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని తమ చేతివృత్తితో సజీవంగా ఉంచుతున్న చేనేత కళాకారులు దేశ సాంస్కృతిక వారసత్వానికి నిజమైన వారసులని గద్దె అనూరాధ పేర్కొన్నారు. ఎన్నో సవాళ్లు ఎదురైనా తమ కళా నైపుణ్యాన్ని,





సంప్రదాయాలను కాపాడుకుంటూ అద్భుతమైన వస్త్రాలను రూపొందిస్తున్న వారి కృషి అభినందనీయమన్నారు.
చేనేత కళాకారులకు మనం అందించే నిజమైన గౌరవం వారి ఉత్పత్తులను ఆదరించడమేనని తెలిపారు. కళను గౌరవిద్దాం.. మన సంస్కృతి సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు.

**21వ తేదీ వరకు ఎక్స్‌పో**

ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. చందేరి, మహేశ్వరి, కోట, రాజ్‌కోట్ పటోలా తదితర ప్రాంతాల ప్రత్యేక డిజైన్ల చేనేత వస్త్రాలు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎక్స్‌పో ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. దసరా, దీపావళి, వివాహాలు, శుభకార్యాలు, పండుగలు, ప్రత్యేక సందర్భాలకు అనువైన పట్టు చీరలు, చేనేత వస్త్రాలు, డ్రెస్సు మెటీరియల్స్ తదితర ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచినట్లు పేర్కొన్నారు.నేత కళాకారులు, సహకార సంఘాలు, ప్రామాణిక తయారీదారులు నేరుగా వస్త్రాలను ప్రదర్శిస్తున్నందున నాణ్యతతో పాటు సరసమైన ధరల్లో కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా వస్త్ర ప్రియులు కుటుంబ సమేతంగా ఎక్స్‌పోను సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో అవుట్ డోర్ అడ్వర్టైజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం.మంజుల తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించండి : ప్రత్తిపాటి

- పట్టణంలోని వినాయక మండపాలకు వెళ్లి.. గణపయ్యలను దర్శించుకున్న మాజీమంత్రి.
- భక్తులు, నిర్వాహకులు ఏర్పాటుచేసిన ప్రసాదవితరణను ప్రారంభించిన ఎమ్మెల్యే.

**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 16:**
వినాయకచవితి సందర్భంగా పూజాకార్యక్రమాలు, వేడుకలు నిర్వహించడం ఎంత ముఖ్యమో, స్వామివారి నిమజ్జనం కూడా అంతే ముఖ్యమని, ఆ కార్యక్రమంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. పట్టణంలోని మద్ది మల్లయ్య వీధి, దేవిశెట్టి బజార్, పొట్టి శ్రీరాములు బజార్, స్టీలు కొట్ల బజార్, గోల్డ్ షాపుల బజార్, చలివేంద్రం వీధి, సుగాలి కాలనీ, ఆపిల్ బాయ్స్ యూత్, ఎల్లో బాయ్స్ యూత్, దుంటి గణపతి యూత్ ల ఆధ్వర్యంలో



పూజలందుకుంటున్న గణేశ మూర్తులను ప్రత్తిపాటి మంగళవారం దర్శించుకున్నారు. నిర్వాహకులు మండపాలను బాగా అలంకరించారని, విద్యుత్ వెలుగులతో దేదీప్యమానంగా విరాజిల్లుతున్న లంబోదరుని ప్రతిరూపాలను చూడటానికి రెండుకళ్లు సరిపోవడం లేదని ఈ సందర్భంగా ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు. వినాయక నిమజ్జనం వేళ నిర్వాహకులు, భక్తులు తగిన జాగ్రత్తలు పాటించాలన్న ప్రత్తిపాటి.. వీధుల్లో ఊరేగింపు సమయంలో, ముఖ్యంగా నిమజ్జనం చేసేటప్పుడు కాలువలు, నదుల వద్ద ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జనాన్నికూడా శాస్త్రోక్తంగా నిర్వహించినప్పుడే విఘ్నేశ్వరుని అనుగ్రహం పరిపూర్ణంగా కలుగుతుందన్నారు. వినాయకచవితి వేడుకల్లో భాగంగా మండపాల వద్ద నిర్వాహకులు, భక్తులు ఏర్పాటుచేసిన ప్రసాదవితరణ ప్రారంభించిన ప్రత్తిపాటి.. స్వయంగా భక్తులకు వడ్డించారు.

## స్థానిక ఎన్నికలకు వైసీపీ శ్రేణులు సిద్ధం కావాలి

### క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలి

**చీరాల, సెప్టెంబర్ 16, (పెన్ పవర్) :**
స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని చీరాల వైసీపీ ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు సూచించారు. బుధవారం చీరాల మండలం రామకృష్ణాపురం క్యాంపు కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.సమావేశం ప్రారంభంలో కరణం వెంకటేష్ బాబు పార్టీ నాయకులకు ఐడీ కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నాయకుడు తన పరిధిలో పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించాలని, ఎన్నికల సమయానికి పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల, పట్టణ, గ్రామ, వార్డు పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు




పాల్గొన్నారు.

## ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికల నిలుపుదలకు

# వైసీపీ కోర్టులను ఆశ్రయిస్తోంది : ప్రత్తిపాటి

- చిలకలూరిపేట పట్టణంలో జరిగిన అభివృద్ధి అంతా టీడీపీ చేసిందే.
- గెలుపు అసాధ్యమని తెలిసే వైసీపీ ఎన్నికలకు అడ్డు తగులుతోంది.
- కుటుంబ సాధికార సారథులు మనసుపెట్టి పనిచేస్తే వైసీపీ డిపాజిట్లు గల్లంతే.

**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 16:**
సంక్షేమ పథకాల్లో అర్హుల గుర్తింపు.. అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారం.. రెండేళ్ల పాలన విజయాలు.. ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పనితీరు వంటి అంశాలే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు. ప్రజల్లో పార్టీ ఇమేజ్, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగిందని, దాన్ని ఓట్లుగా మార్చడంలో యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్ ఛార్జులు, కుటుంబ సాధికార సారథులు కీలక పాత్ర పోషించాలని ఆయన స్పష్టంచేశారు.బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్ ఛార్జులు, కుటుంబసాధికార సారథులతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు కీలక సూచనలు చేశారు.కే.ఎస్.ఎస్ ల పనితీరే విజయావకాశాలు మెరుగుపరుస్తుంది...చిలకలూరిపేట మున్సిపాలిటీలో గెలవలేమని తెలిసే ఎన్నికలు ఆపాలన్న దురుద్దేశంతో వైసీపీ కోర్టుల్లో తప్పుడు కేసులు వేస్తోందని ప్రత్తిపాటి తెలిపారు. స్థానిక



ఎన్నికలు ఆపాలన్న లక్ష్యంతో వైసీపీ ఉంటే.. ప్రజామద్ధతుతో ప్రతి ఎన్నికలో విజయం సాధించాలన్న పట్టుదలతో కూటమి పార్టీలు ఉన్నాయన్నారు.ఈ రెండేళ్లలో పట్టణంలో చేసిన అభివృద్ధి ఒకెత్తు అయితే, ఇటీవల రూ.65 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు మరో ఎత్తని, అవన్నీవేగంగా పూర్తయ్యేలా యంత్రాంగం పనిచేస్తోందని ప్రత్తిపాటి తెలిపారు. కుటుంబ సాధికార సారథులు ప్రతి వార్డులో పార్టీ విజయావకాశాలు మెరుగుపరచాలని, ఆదిశగా ఇప్పటినుంచే ప్రత్యేక కార్యాచరణ చేపట్లాలని ఎమ్మెల్యే సూచించారు. యూనిట్, క్లస్టర్లు, బూత్ ఇన్ ఛార్జులు ఎవరి పరిధిలో వారు క్షేత్రస్థాయిలో మంచి పనితీరు కనబరచాలన్నారు. అభిప్రాయబేధాలు, వ్యక్తిగత ఆలోచనలు పక్కన పెట్టి పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేసే వారికే భవిష్యత్ లో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు.

**మనసు పెట్టి పనిచేస్తే పట్టణంలో వైసీపీ గల్లంతే..**

వార్డుల పునర్విభజనపై ప్రజల్లో అభ్యంతరాలు వ్యక్తమైతే, వెంటనే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా, పార్టీ శ్రేణులు వారికి అవగాహన కల్పించాలన్నారు. చిలకలూరిపేట పట్టణంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప.. మరే నాయకుడు, పార్టీ ఏమీ చేసింది లేదన్నారు. కుటుంబ సాధికార సారథులు (కే.ఎస్.ఎస్) ప్రతి ఓటర్ నాడిని పసిగట్టి పనిచేయాలని, 48 వార్డుల్లో ప్రతి ఇంట్లో, ప్రతి ఒక్కరిలో కూటమిపాలనపై సానుకూలత ఏర్పడాలని, ఓటర్ల అభిమానం ఓట్ల రూపంలో కనిపించాలని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ప్రధాన పాత్ర పోషించాల్సింది కే.ఎస్.ఎస్ లేనని, వారు మనసుపెట్టి పనిచేస్తే పట్టణంలో వైసీపీ డిపాజిట్లు గల్లంతవుతాయన్నారు.
సమావేశంలో నియోజకవర్గ అబ్జార్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు బత్తినేని శ్రీనివాసరావు, మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, కొత్త కోటేశ్వరరావు, షేక్ మస్తాన్ వలి, అమర రమాదేవి, పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు, యూనిట్, బూత్, ఇంచార్జిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సమన్వయంతో ముందుకు సాగాలి

### నరసరావుపేట పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశంలో నిర్ణయం

నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 16:
రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికపై చర్చించేందుకు నరసరావుపేట పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశం బుధవారం గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించబడింది.



ఈ సమావేశంలో కోఆర్డినేషన్ టీమ్ సభ్యులు సయ్యద్ జిలాని, శివ పార్వతి, వీరవల్లి వంశీతో పాటు సపోర్ట్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఎన్నికల నిర్వహణలో అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యకర్తలతో అనుసంధానం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే, రాబోయే రోజుల్లో నిర్వహించాల్సిన సమావేశాలు, ప్రచార కార్యక్రమాలు, బూత్ స్థాయి ఏర్పాట్లు మరియు పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరూ సమిష్టిగా పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యులు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన తదుపరి కార్యక్రమాలపై పలు సూచనలు చేసి, సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు.



## మట్టి వినాయక మండపాలకు ఆర్థిక ప్రోత్సాహం




**పెడన,పెన్ పవర్,సెప్టెంబర్ 15**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసిన పెడన పట్టణంలోని ఆరు మండపాల నిర్వాహకులకు పర్యావరణ ఉద్యమకారుడు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి యర్రసుబ్రహ్మణ్యేశ్వరరావు ఆర్థిక ప్రోత్సాహం అందించారు. ఒక్కో మండపానికి రూ.1,000 చొప్పున మొత్తం రూ.6,000 నగదు అందజేశారు. మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. పర్యావరణ హిత కార్యక్రమాన్ని చేపట్టిన సుబ్రహ్మణ్యేశ్వరరావును పలువురు అభినందించారు.

## చేనేత కుటుంబాలకు ఆర్థిక సాయం



**పెడన,పెన్ పవర్,సెప్టెంబర్ 16**

వినాయక చవితి సందర్భంగా పెడన 11వ వార్డు, కప్పలదొడ్డిలో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం, దివ్యాంగత్వంతో బాధపడుతున్న నాలుగు చేనేత కుటుంబాలకు సుమారు రూ.10 వేల విలువైన బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి ఆధ్వర్యంలో, దాతలు పిచ్చుక లక్ష్మీకుమారి, గుత్తి డీకే సుబ్బారాయుడు ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కొసనం భ్రమరాంబ, పేరిశెట్టి ఈశ్వరి, చంద్రనాగమ్మ, యక్కల లక్ష్మీ కుటుంబాలకు నెలరోజులకు సరిపడా సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బూసం సాయిబాబు, బళ్ల నాగేశ్వరరావు, చేనేత కళాకారులు పాల్గొన్నారు.

## పంట కోత ప్రయోగాలపై శిక్షణ



**గూడూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 15**

గూడూరు మండలంలోని రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే) అసిస్టెంట్లకు పంట కోత ప్రయోగాలు (జజజు) నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. వరి పంట కోత ప్రయోగాలను నిర్ణీత విధానంలో, అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులు సూచించారు. ప్రయోగాల వివరాలను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నమోదు చేయాలని తెలిపారు. పంట కోత ప్రయోగాలకు సంబంధించిన ఫారం-1ను వెంటనే సబ్మిట్ చేయాలని ఆర్ఎస్‌కే అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఎస్వో, మండల వ్యవసాయ అధికారి, ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## డ్రైన్‌లో గుర్రపు డెక్క తొలగింపు



**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 15**

గూడూరు మండలం రామన్నపేటఐనంపూడి డ్రైన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించారు. రామన్నపేట పీఏసీఎస్ అధ్యక్షుడు మురాల ధనేష్ పర్యవేక్షణలో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టారు. డ్రైన్‌లో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతుండటంతో రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డ్రైన్ ద్వారా సాగునీరు సక్రమంగా ప్రవహించేందుకు ఎప్పటికప్పుడు పూడిక, గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు వీర వెంకటేశ్వరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## పొలిటికల్ ఫ్లెక్సీల వార్

### ఆకట్టుకుంటున్న పోటాపోటీ డైలాగులు






**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 16:**

ఎడ్లపాడు మండల కేంద్రంలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద వెలసిన రెండు రాజకీయ ఫ్లెక్సీలు ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. జనసేనాని పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా కూటమి శ్రేణులు ఏర్పాటు చేసిన ఒక ఫ్లెక్సీలో "రారు.. రానివ్వం" అంటూ పరోక్షంగా ప్రతిపక్షాన్ని ఉద్దేశించి ఘాటు డైలాగులు ముద్రించారు. దీనికి ఏమాత్రం తీసిపోని విధంగా, దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వైసీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన మరో ఫ్లెక్సీలో "2029లో మళ్ళీ జగనన్నే సీఎం.. రాసిపెట్టుకొండి...! మీకు చేతనైతే ఆపుకోండి...! " అంటూ బహిరంగ సవాల్ విసిరారు. ఒకే సెంటర్లో పక్కపక్కనే వెలసిన ఈ పోటాపోటీ ఫ్లెక్సీలు స్థానిక రాజకీయ వేడిని ప్రతిబింబించడంతో పాటు, అటుగా వెళ్లే ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

## పేటలో డ్రంక్ అండ్ డ్రైవ్: ఇద్దరికి రూ.20 వేల జరిమానా

**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 16:**

చిలకలూరిపేట : పట్టణంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు స్థానిక కోర్టు భారీ జరిమానా విధించింది. చిలకలూరిపేట పట్టణ పోలీసులు సదరు వ్యక్తులను బుధవారం స్థానిక కోర్టులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి.. ఒక్కొక్కరికి రూ. 10,000 చొప్పున ఇద్దరికీ కలిపి మొత్తం రూ. 20,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వాహనదారులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో ఆల్కహాల్ రీడింగ్ 150 దాటితే.. ఇక మీదట కేవలం జరిమానాతో సరిపెట్టబోమని, ఫైన్‌తో పాటుగా జైలు శిక్ష కూడా తప్పదని ఆయన స్పష్టం చేశారు.

## కోటప్పకొండలోని కోడెల ఘాట్ వద్ద డాక్టర్ కోడెల శివప్రసాదరావుకు ఘన నివాళులు

### - 7వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసిన డాక్టర్ కోడెల శివరామ్





నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 16:

పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం కోటప్పకొండలోని కోడెల ఘాట్ వద్ద మాజీ శాసనసభాపతి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు 7వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఆయన తనయుడు డాక్టర్ కోడెల శివరామ్ మాట్లాడుతూ, ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన కోడెల శివప్రసాదరావు సేవలు చిరస్మరణీయమని అన్నారు. రాజకీయ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా, శాసనసభాపతిగా ఆయన అందించిన సేవలు రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పనిచేసిన కోడెల శివప్రసాదరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డాక్టర్ శివరామ్ తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కోడెల అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ పలువురు నాయకులు తమ అనుభవాలను పంచుకున్నారు.

## కోడెల సేవలు చిరస్మరణీయం

- 7వ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల ఘన నివాళులు
- విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసిన ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు




**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 16:**

దివంగత నేత మాజీ ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు 7వ వర్ధంతి సందర్భంగా నరసరావుపేటలో పలుచోట్ల ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు బుధవారం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ కోడెల తనయుడు కోడెల శివరాం, ఉమ్మడి కూటమి నాయకులు, తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కోడెల శివప్రసాదరావు విగ్రహానికి ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లింగంగుంట్ల ప్రభుత్వ ఏరియా వైద్యశాల వద్ద, 60 అడుగుల రోడ్డు, కమ్మ హాస్టల్, ఎన్జీవో కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కోడెల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సేవకు జీవితాన్ని అంకితం చేసిన కోడెల శివప్రసాదరావు సేవలు చిరస్మరణీయమని అన్నారు. నరసరావుపేట ప్రాంతంతో పాటు తెలుగుదేశం పార్టీకి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ప్రజల కోసం పనిచేసిన ఆయన సేవా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కోడెల శివప్రసాదరావు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు పలుమార్లు ప్రాతినిధ్యం వహించడంతో పాటు రాష్ట్ర మంత్రిగా, శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 20142019 మధ్య ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా పనిచేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కోడెల శివప్రసాదరావు సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు.

## శ్రీ వినాయక ట్రస్ట్ ఆధ్వర్యంలో వైభవంగా గణేష్ ఉత్సవాలు

### ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన మర్రి రాజశేఖర్



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 16:**

చిలకలూరిపేటలో శ్రీ వినాయక ట్రస్ట్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ట్రస్ట్ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సింగ్ కళ్యాణ మండపంలో ప్రత్యేకంగా మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ట్రస్ట్ కమిటీ సభ్యులు శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్‌ను ఆహ్వానించగా, వారి ఆహ్వానం మేరకు ఆయన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ చంద్రపట్ల మణికుమార్, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో మర్రి రాజశేఖర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం మర్రి రాజశేఖర్ మట్టి గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సీతారాముల ప్రతిమలను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. శ్రీ వినాయక ట్రస్ట్ సభ్యులు ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి గత తొమ్మిది సంవత్సరాలుగా నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలు సమాజంలో భక్తిని పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మికతను చాటుతున్నాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు గొప్ప సందేశాన్ని అందిస్తున్న ట్రస్ట్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. చంద్రపట్ల మణికుమార్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలు పట్టణంలో ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయని అన్నారు. ఆయన ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో భక్తి, క్రమశిక్షణతో పాటు సామాజిక బాధ్యత కూడా స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ముఖ్యంగా మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా అందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. మణికుమార్‌తో పాటు ట్రస్ట్ కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో చిలకలూరిపేట ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కమిటీ సభ్యులు కొల్లా ఉమ మహేశ్వరరావు, రామ్ లక్ష్మణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజేటి నరేంద్ర, సయ్యద్ హిదాయితుల్లా, వేజర్ల కోటేశ్వరరావు, ప్రత్తిపాటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## 25న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ




**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 16:**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల దాదాపు 4 లక్షల 62 వేల 714 మంది బాలబాలికలకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా సమన్వయ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు విద్యాసంస్థల బయట ఉన్న బాలబాలికలు, కౌమార బాలబాలికలకు మాత్రలు అందించనున్నట్లు తెలిపారు. వయస్సును బట్టి నిర్దేశిత మోతాదులో మాత్రలను అందించాలని అధికారులను ఆదేశించారు. ఒకటి నుంచి రెండేళ్ల పిల్లలకు సగం మాత్రను నీటిలో కరిగించి ఇవ్వాలని, రెండు నుంచి మూడేళ్ల పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలని సూచించారు. మూడు నుంచి 19 సంవత్సరాల వయస్సు గల వారికి పూర్తి మాత్రను చప్పరించేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం చేసిన అరగంట తర్వాత మాత్రలు ఇవ్వాలని సూచించారు. విద్యాశాఖ, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖతో పాటు ఇతర శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. నులిపురుగుల నివారణ ద్వారా రక్తహీనత వంటి సమస్యలను అధిగమించే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరికీ నిర్దేశిత మోతాదులో మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. విజయలక్ష్మి మాట్లాడుతూ, ఆల్బెండజోల్ మాత్రలను చప్పరించడం వల్ల ఎటువంటి దుష్పరిణామాలు కలుగవని తెలిపారు. ఈ నెల 25న మాత్రలు తీసుకోని వారికి అక్టోబర్ 5న నిర్వహించే మాప్ అప్ రౌండ్‌లో పంపిణీ చేస్తామని చెప్పారు. మాత్రలు తీసుకున్న తర్వాత ఎవరైనా అస్వస్థతకు గురైతే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి తగిన చికిత్స పొందాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి. రంగారావు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జె. పార్థసారథి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.జి. ప్రసూన, ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రాంతీయ పర్యవేక్షక అధికారి జి. సునీత, వైద్య ఆరోగ్య శాఖ డీపీఎంఓ డా. సుజాతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కర్లపాలెంలో టీడీపీ సమీక్షా సమావేశం

- పార్టీ బలోపేతంపై నాయకులతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు సమీక్ష
- పేరలి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా జోగి సురేష్ ప్రమాణస్వీకారం



**కర్లపాలెం, సెప్టెంబర్ 16, (పెన్ పవర్) :**

బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల పార్టీ నాయకులతో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత అంశాలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులతో చర్చించారు.

అనంతరం పేరలి గ్రామ నూతన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా జోగి సురేష్‌తో ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, బాపట్ల పార్లమెంటు ఉపాధ్యక్షుడు మద్దాల మునలయ్య, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షుడు బాజీ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి, కర్లపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు పిట్ల వసంత రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ నక్కల వెంకటస్వామి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోదీ జన్మదినం సందర్భంగా ఆశీర్వాద దీపాలు వెలిగిద్దాం

### బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు




**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 16:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు తెలిపారు. సెప్టెంబర్ 17న సాయంత్రం 7 గంటలకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు దీపాలు వెలిగించి ప్రధాని మోదీకి ఆశీర్వాదాలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. మోదీకి సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ప్రార్థించాలని కోరారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 ఏళ్ల పాటు, అనంతరం ప్రధానమంత్రిగా దేశానికి మోదీ అందించిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సేవ, సమర్పణ, సంకల్పం స్ఫూర్తితో బీజేపీ శ్రేణులు ప్రజలకు మరింత చేరువగా పనిచేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆశీర్వాద దీప కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని తిరుపతిరావు కోరారు.

# మట్టి విగ్రహాలతో వినాయక చవితి నిర్వహణకు కృషి: కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 16,**
నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నవ గుంటూరులో భాగంగా నిర్వహించిన గ్రీన్ గణేష్ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. 55 పాఠశాలలకు చెందిన 25 వేల మంది విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాల్లో సుమారు 50 శాతం విగ్రహాలను ప్రజలు వినాయక చవితి సందర్భంగా పూజించారని వెల్లడించారు.బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గ్రీన్ గణేష్ కార్యక్రమంలో భాగస్వాములైన విద్యా సంస్థలు, అధికారులు, సిబ్బందికి అభినందన సభ నిర్వహించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మట్టి విగ్రహాల వినియోగం ద్వారా నీటి వనరులు, భూమి కాలుష్యాన్ని తగ్గించేందుకు కృషి చేశామన్నారు. వచ్చే ఏడాది నగరంలో వంద శాతం మట్టి విగ్రహాలతో కాలుష్యరహిత వినాయక చవితి నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు.నగరంలో ఇప్పటికే 20 వేలకు పైగా మొక్కలు నాటామని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఈ-ఆటోల ద్వారా కాలుష్యరహిత చెత్త సేకరణ వంటి చర్యలు చేపట్టామని తెలిపారు. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో గుంటూరు రెండో స్థానం సాధించడంలో ప్రజల



సహకారం కీలకమైందన్నారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు, విద్యా సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

## అప్పికట్ల, భర్తిపూడి, గుడిపూడి గ్రామాల్లో విస్తృత పర్యటన



బాపట్ల, సెప్టెంబర్ 16, (పెన్ పవర్) :
బాపట్ల నియోజకవర్గంలోని బాపట్ల మండలం అప్పికట్ల, భర్తిపూడి, గుడిపూడి గ్రామాల్లో బాపట్ల ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ విస్తృతంగా పర్యటించారు. జిల్లా, మండల స్థాయి వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి గ్రామాల్లోని వ్యవసాయ పొలాలను పరిశీలించారు.ఎల్-నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పంటల పరిస్థితి, సాగునీటి లభ్యత తదితర అంశాలపై రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిమజ్జన భక్తులకు రహదారి సౌకర్యం

## ఎమ్మెల్యే మాలకొండయ్య ఆదేశాలతో రాత్రికి రాత్రే గ్రావెల్ రోడ్ల ఏర్పాటు



**చీరాల, సెప్టెంబర్ 16 (పెన్ పవర్):**
వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం సముద్ర తీర ప్రాంతాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రహదారి సౌకర్యాలను మెరుగుపరిచారు. ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశాల మేరకు, మద్దులూరి మహేందర్ నాథ్ సూచనలతో చల్లారెడ్డిపాలెం టీడీపీ గ్రామ అధ్యక్షుడు కీర్తి పూర్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.వేటపాలెం మండలంలోని జాండ్రపేట, పాత చీరాల, కటారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం తదితర ప్రాంతాల నుంచి సముద్ర తీరానికి వినాయక విగ్రహాలను తీసుకువచ్చే భక్తులు గతంలో రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ విషయాన్ని భక్తులు కీర్తి పూర్ణ దృష్టికి తీసుకురావడంతో ఆయన ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఆదేశాలు, మహేందర్ నాథ్ సూచనల మేరకు కీర్తి పూర్ణ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. ఇబ్బందికరంగా ఉన్న మార్గాల్లో రాత్రికి రాత్రే గ్రావెల్ పోయించి రహదారులను సరిచేశారు. భక్తులు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడకుండా రహదారుల వెంట విద్యుత్ దీపాల ఏర్పాట్లు కూడా చేపడుతున్నారు.నిమజ్జన కార్యక్రమం సందర్భంగా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టి భక్తులకు అవసరమైన సూచనలు చేస్తున్నారు. రహదారి సౌకర్యాలు కల్పించిన కీర్తి పూర్ణతో పాటు, ఆదేశాలు ఇచ్చిన ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, సూచనలు చేసిన మద్దులూరి మహేందర్ నాథ్‌కు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.



# పేట జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం..

## తప్పిన ప్రాణాపాయం



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 16:**
జాతీయ రహదారిపై గణపవరం సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుంటూరు నుండి చిలకలూరిపేట వైపు వెళ్తున్న షిఫ్ట్ డిజైర్ ట్రావెల్స్ కారును గణపవరం - తిమ్మాపురం క్రాసింగ్ కూడలి వద్ద రాంగ్ రూట్‌లో అతివేగంగా దూసుకొచ్చిన ఓ బొలెరో వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు కాగా, అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. కారును ఢీకొట్టిన వెంటనే బొలెరో డ్రైవర్ అక్కడినుంచి పరారవ్వడంతో ఇది హిట్ అండ్ రన్ ఘటనగా తెలుస్తోంది. ఎప్పటినుంచో ప్రమాదాలకు నిలయంగా మారుతున్న ఈ క్రాసింగ్ వద్ద నిత్యం ఇలాంటి రాంగ్ రూట్ ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు వెంటనే స్పందించి పరారైన డ్రైవర్‌ను పట్టుకోవాలని, అలాగే ఈ కూడలిలో భద్రతా చర్యల్లో భాగంగా డేంజర్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గణపవరం, తిమ్మాపురం గ్రామాల ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# గుంటూరు వార్డ్ రిజర్వేషన్లపై అపోహలు వద్దు కమిషనర్ కె.మయూర్ అశోక్

**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 16,**
గుంటూరు నగరపాలక సంస్థ వార్డ్ రిజర్వేషన్లపై సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపుల్లో ప్రచారం అవుతున్న వార్తలను ప్రజలు నమ్మవద్దని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరపాలక సంస్థలోని 57 వార్డులను 76 వార్డులుగా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ ప్రకటించిందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 22వ తేదీ నాటికి వార్డుల వారీగా గుర్తింపు కార్డుల ఓటరు జాబితాను ప్రచురించాల్సి ఉందని తెలిపారు.అనంతరం గెజిట్ ప్రకారం వార్డుల వారీగా



కుల గణన చేపట్టి, వివరాలను నిర్దేశిత వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పారు. తదుపరి వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్, ఎన్నికల నిబంధనల ప్రకారమే నిర్వహిస్తామని, ఏ ప్రాంతానికి ఆ ప్రాంతంలో ఇష్టానుసారంగా రిజర్వేషన్లు నిర్ణయించే అవకాశం లేదన్నారు.వార్డ్ రిజర్వేషన్లపై నిరాధారమైన ప్రచారాలు, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ప్రజలు అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సూచించారు.

# బలరాం కాలనీ భూములపై రైతుల ఆవేదన

**- కోర్టు ఉత్తర్వులు, భూముల రికార్డులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్**
**- నిర్మాణాలపై పంచాయతీ అధికారుల తనిఖీలు.. అనుమతులు, పత్రాలు పరిశీలించిన తర్వాతే నిర్మాణాలు కొనసాగించాలని సూచన**

**వేటపాలెం, సెప్టెంబర్ 16 (పెన్ పవర్):**
వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని సోనా పోరంబోకు భూముల్లో ఏర్పాటైన బలరాం కాలనీ వ్యవహారంపై రైతులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 15 ఎకరాల భూములపై ఆధారపడి పంటలు సాగు చేసుకుంటున్న రైతుల హక్కులు, భూముల పరిరక్షణపై అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.గతంలో 2003లో పాపినేని సుధాకర్ కోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు పొందారని, అనంతరం 2023లో హైకోర్టు నుంచి కూడా





ఉత్తర్వులు వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. అయితే కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ బలరాం కాలనీ పేరుతో భూముల కేటాయింపులు, నిర్మాణాలు జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. అర్హులైన పేదలకు కేటాయించాల్సిన భూములు అనర్హులకు చేరుతున్నాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ఇదిలా ఉండగా బలరాం కాలనీలో పంచాయతీ కార్యదర్శి శృతి నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను తనిఖీ చేశారు. సంబంధిత అనుమతులు, పత్రాలను పంచాయతీ కార్యాలయంలో చూపించిన తర్వాతే నిర్మాణాలు కొనసాగించాలని సూచించారు. పత్రాలు లేని నిర్మాణాలను నిలిపివేయాలని, నిబంధనలు పాటించాలని కాలనీ వాసులకు తెలిపారు.భూముల రికార్డులు, కేటాయింపులు, ఎన్‌ఓసీలు, విద్యుత్ మీటర్లు, నిర్మాణ అనుమతులపై సమగ్రంగా పరిశీలించి, అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఇళ్ల స్థలాలు పారదర్శకంగా కేటాయించాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

# ధైర్యం, తెగింపు, ప్రజాభిమానం,

## సేవాగుణాల కలబోత కోడెల : ప్రత్తిపాటి



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 16:**
మాజీ మంత్రి, నవ్యాంధ్రప్రదేశ్ తొలి సభాపతి దివంగత కోడెల శివప్రసాదరావు రాజకీయ జీవితం ఎందరో నాయకులకు మార్గదర్శకమని, ప్రజా నాయకుడిగా, ప్రజా వైద్యుడిగా ఆయన అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. కోడెల శివప్రసాదరావు 7వ వర్ధంతి సందర్భంగా బుధవారం ప్రత్తిపాటి స్థానిక క్యాంపు కార్యాలయంలో కోడెల చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి కోడెలతో తనకున్న అనుభవాల్ని టీడీపీ నాయకులతో పంచుకున్నారు. ధైర్యం తెగింపు, ప్రజాభిమానం, సేవాగుణాల కలబోత కోడెలని, ఆయన పనితీరు, ఆలోచనలు, నాయకత్వ పటిమ ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీని బలపరిచిందని ప్రత్తిపాటి తెలిపారు. తిరుగులేని ప్రజాభిమానాన్ని సొంతం చేసుకున్న కోడెల, తన రాజకీయ జీవితంలో ఎన్నో విజయాలు సాధించారని, బాధ్యతలు చేపట్టిన ప్రతి శాఖలోనూ తనదైన ముద్ర వేశారని ప్రత్తిపాటి కొనియాడారు. వైద్యుడిగా, సమర్థుడైన రాజకీయ నాయకుడిగా ప్రజల నాడి పసిగట్టడంలో ఆయనకు మరెవరూ సాటిరారని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు.

# యడ్లపాడు మండలంలో ఎంపీటీసీ/జడ్పీటీసీ సాధారణ ఎన్నికల 2026 పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీల సమావేశం.





**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 16:**
యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీటీసీ/జడ్పీటీసీ సాధారణ ఎన్నికల 2026కు సంబంధించి రాజకీయ పార్టీల సమావేశం ఎంపీడీవో హేమలత దేవి అధ్యక్షతన ఏర్పాటు చేయబడింది.ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.ఈ సమావేశంలో మండల పరిధిలోని 58 పోలింగ్ స్టేషన్ల వివరాలను వివరించి, వాటిపై రాజకీయ పార్టీల ప్రతినిధుల అభ్యంతరాలు,సూచనలు ఉన్నాయా అనే అంశంపై చర్చించడం జరిగింది. యడ్లపాడు మండలంలో మొత్తం 44,581 మంది ఓటర్లు ఉన్నట్లు, వారి సౌలభ్యం కోసం 58 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు అధికారులు తెలిపారు.అనంతరం, వచ్చే 19 సెప్టెంబర్ 2026 న జిల్లా కలెక్టర్ ఆమోదంతో ఫైనల్ పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రచురించబడుతుందని అధికారులుతెలియజేశారు.ఈ సమావేశంలో సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేటలో అంగరంగ వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

**- ప్రత్యేక పూజలు నిర్వహించిన యువ నేత మండలనేని చరణ్ తేజ**



చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 16:
చిలకలూరిపేట : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పేట పట్టణంలోని 8వ వార్డు లో రెండుపందిళ్ళు తో పాటు ఎన్టీఆర్ కాలనీ సంతబజార్ లో ఏర్పాటు చేసిన పలు గణనాథుని మండపాలను యువ నాయకులు మండలనేని చరణ్ తేజ,నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్ కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లోని విఘ్నేశ్వరుని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మండపాల వద్దకు విచ్చేసిన యువనేత చరణ్ తేజకు ఆయా వినాయక ఉత్సవ కమిటీల సభ్యులు, నిర్వాహకులు సాదరంగా ఎదురేగి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు జనసైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

# సదరం సర్టిఫికెట్ల జారీని వేగవంతం చేయాలి

## నవ్యాంధ్ర వికలాంగుల రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా



**నెల్లూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 16,**
ప్రభుత్వ ఏరియా వైద్యశాలల్లో వైద్య పరీక్షలు చేయించుకున్న దివ్యాంగులకు సకాలంలో సదరం సర్టిఫికెట్లు జారీ చేయకపోవడంతో పలు సంక్షేమ పథకాలను కోల్పోతున్నారని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా డీసీహెచ్ఎస్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.వి. రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కాలేషా మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా వైద్యశాలల్లో వైద్య పరీక్షలు పూర్తయిన అర్హులైన దివ్యాంగులకు రీ వెరిఫికేషన్ అనంతరం సదరం సర్టిఫికెట్లు జారీ చేయడంలో జాప్యం జరుగుతోందన్నారు. నెలలు గడుస్తున్నా సర్టిఫికెట్లు అందకపోవడంతో దివ్యాంగ శక్తి బస్సు పాసులతో పాటు పలు సంక్షేమ పథకాలను సకాలంలో పొందలేక తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.సుదూర ప్రాంతాల నుంచి వచ్చే దివ్యాంగులు సర్టిఫికెట్ల కోసం పదేపదే వైద్యశాలలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోందని, అయినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు తక్కువ సమయం కేటాయించడంతో సదరం సర్టిఫికెట్లు అందని అర్హులైన దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.కావున జిల్లా అధికారులు సమస్యపై సమగ్రంగా పరిశీలించి, అర్హులైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని కాలేషా కోరారు. దివ్యాంగుల హక్కుల చట్టం2016 ప్రకారం తగిన చర్యలు తీసుకుని, సంక్షేమ పథకాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బి. ఉమామహేశ్వరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల హక్కులు,

## ఉద్యోగ భద్రతకు ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలి

**- ఏపీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాపట్ల ఆర్టీసీ డిపోలో జెండా ఆవిష్కరణ**
**- ప్రజా రవాణాను ప్రైవేటీకరణ చేయకుండా ఆర్టీసీని బలోపేతం చేయాలని డిమాండ్**



**బాపట్ల, సెప్టెంబర్ 16, (పెన్ పవర్) :**
ఆంధ్రప్రదేశ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏపీ ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల ఆర్టీసీ డిపో వద్ద బుధవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఆవిర్భవించి 47 సంవత్సరాలు పూర్తయి 48వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఏపీ ఎస్‌డబ్ల్యూఎఫ్ బాపట్ల జిల్లా కార్యదర్శి బి. తిరుమలరెడ్డి జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తిరుమలరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఏపీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నిరంతరం పోరాడుతోందన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సంక్షేమ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత, కార్మిక హక్కులు కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకుండా ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని, ఆర్టీసీ స్థలాలు, ఇతర ఆస్తులను ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వ ఆధీనంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రజా రవాణా వ్యవస్థను పరిరక్షిస్తూ కార్మికుల ప్రయోజనాలను కాపాడే చర్యలు తీసుకోవాలని కోరారు.సీఐటీయూ బాపట్ల జిల్లా కార్యదర్శి ఎన్. బాబురావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ తదితర సంక్షేమ సౌకర్యాలు సక్రమంగా అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటి ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే విధానాలను అనుసరించకూడదన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షులు సత్యనారాయణ, సీఐటీయూ బాపట్ల పట్టణ నాయకులు, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పదవుల కోసం మతం మార్చుకున్నారు!! - విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణలు





**హైదరాబాద్ పెన్ పవర్:** విపక్షం వైసీపీని లక్ష్యంగా చేసుకుని మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి చేస్తున్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి. కొత్త రాజకీయ పార్టీ పెడతానని కొన్నిరోజులుగా చెబుతున్న విజయసాయిరెడ్డి సమయం, సందర్భం లేకుండా విపక్షంపై ఘాటు విమర్శలతో విరుచుకుపడుతుండటం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. కొత్త పార్టీ ప్రారంభిస్తానని గతంలో ప్రకటించిన సందర్భంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిపై మత మార్పిడి ఆరోపణలు చేసిన విజయసాయిరెడ్డి తాజాగా రెండేళ్ల క్రితం నాటి ఒక వీడియోను షేర్ చేశారు. వైసీపీలో ఎమ్మెల్యే, మంత్రి పదవులు పొందాలంటే జగన్ ను ఆకట్టుకునేందుకు మతం మార్చుకోవాల్సివచ్చేదని ఆరోపించడమే కాకుండా, ఇలా ఎంతోమంది మార్చుకున్నారో వైసీపీలో నెంబర్ వన్ చెప్పాలంటూ పోస్టు పెట్టారు.రెండేళ్ల క్రితం ఏపీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారపురెడ్డి చంద్రశేఖరరెడ్డి ప్రసంగించిన వీడియోను విజయసాయిరెడ్డి తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. "వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక మాజీ, సీనియర్ ఎమ్మెల్యే 2024 ఎన్నికల ముందు చేసిన ఈ ప్రసంగంపై రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు తమ అభిప్రాయం తెలియజేయాలి" అంటూ కోరారు. అంతేకాకుండా "గతంలో ఎంతమంది నాయకులు తమ ఎమ్మెల్యే టికెట్ల కోసం, ఆ తర్వాత ప్రభుత్వంలో మంత్రి పదవుల కోసం జగన్ గారిని ఆకట్టుకునేందుకు మతం మార్చుకున్నారో ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్‌లో నంబర్ వన్ సమాధానం చెప్పాలని కోరుతున్నా." అంటూ రాశారు.

ఉన్నట్టుండి విజయసాయిరెడ్డి చేసిన ఈ పోస్టు రాష్ట్ర రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీస్తోంది. సహజంగా రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలకు తగిన సమయం సందర్భం ఉంటుందని, కానీ ఇప్పుడు ఎలాంటి చర్చ లేని మత మార్పిడుల అంశాన్ని విజయసాయిరెడ్డి తెరపైకి తేవడం వెనుక ఆయన ఉద్దేశం ఏమైవుంటుందో అర్థం కావడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాజకీయ పార్టీ పెట్టాలని భావిస్తున్న విజయసాయిరెడ్డి విపక్షంలో ఉన్న వైసీపీ స్థానంలో ఎదగాలని భావించడంలో తప్పు లేదని, కానీ ఎప్పటిదో వీడియోను బయటకు తీసి ఇప్పుడు వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయం చెప్పాలంటూ నిలదీయడమే ఆశ్చర్యంగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.వైసీపీలో తనకు అన్యాయం జరిగిందని ఆరోపణలు చేస్తున్న విజయసాయిరెడ్డి ఆ పార్టీని అధినేత జగన్మోహనరెడ్డిని రాజకీయంగా దెబ్బతీయాలనే వ్యూహంతో ఇటువంటి పోస్టులు చేస్తున్నారని వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. పాత వీడియోలు బయటకు తీసి కావాల్సిన విధంగా ఎడిటింగ్ చేసుకుని వైరల్ చేయాలని చేయాలని భావించడం కరెక్టు కాదని అంటున్నారు. అదే సమయంలో ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. తన స్థానంలో పార్టీలో ఎదిగిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని చూసి ఓర్వలేకే విజయసాయిరెడ్డి ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైసీపీ నేతలు మండిపడుతున్నారు.

ఇదే సమయంలో విజయసాయిరెడ్డి విమర్శలను అధికార పార్టీ హైలెట్ చేస్తోందని అంటున్నారు. కొద్దిరోజుల క్రితం వైసీపీకి చెందిన జోగి రమేష్ కుటుంబం మతం మార్చుకుందన్న విషయం వెలుగు చూడగా, మంత్రి పదవి కోసమే ఆయన మత మార్పిడి జరిగిందని ప్రత్యర్థులు ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ ప్రచారానికి బలం చేకూర్చేలా విజయసాయిరెడ్డి ప్రశ్నలు సంధిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు రాస్తుండటం ద్వారా ఒక వ్యూహం ప్రకారం వైసీపీ వ్యతిరేక రాజకీయాలు చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# జగన్ రాజకీయం చెయ్...సీనియర్లు కోరేది ఇదేనా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** అదేంటి జగన్ రాజకీయాల్లోనే కదా ఉన్నది, మళ్లీ ఇదేమిటి అన్న సందేహం రావచ్చు. అయితే జగన్ రాజకీయాల్లో ఉన్నా కూడా పక్కా వ్యూహాలతో ఎత్తుగడలతో రాజకీయం చేయాల్సిన అవసరం ఉంది అన్నదే సీనియర్ల మాట. వైసీపీ విషయం తీసుకుంటే జగన్ అధినేతగా ఉన్నారు. ఇక పార్టీ దైనందిన వ్యవహారాలు చూసేందుకు పార్టీ నుంచి వెళ్ళిపోయిన విజయసాయిరెడ్డి లాంటి వారు చెప్పే కోటరీ ఒకటి ఉందని అంటున్నారు. అన్ని విషయాలను సజ్జల రామక్రిష్ణారెడ్డి వంటి వారే చూసుకుంటున్నారు అని అంటున్నారు. ఇక జిల్లాల విషయానికి వచ్చేసరికి రీజనల్ కో ఆర్డినేటర్లను మూడేసి జిల్లాలకు నియమించారు. వారు అక్కడి విషయాలను పర్యవేక్షిస్తారు. ఇలా కొందరు సీనియర్ నేతల చేతిలో పార్టీని పెట్టేసినట్లుగా ఉందని అంటున్నారు. అక్కడ వారు ఏమి చెబితే అదే జరుగుతోందని అంటున్నారు. దాంతో జగన్ మీద వైసీపీ మీద అభిమానం ఉన్న వారు కూడా వైసీపీలో కొనసాగే పరిస్థితులు లేకుండా పోతున్నాయని అంటున్నారు.

**నేరుగా అనుసంధానం :**

అధినాయకుడు పార్టీ నాయకులకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండాలని కోరుకుంటారు. అలాగే పార్టీలో ఎక్కడ ఏమి జరుగుతుంది అన్నది కూడా ఆయన గమనిస్తూ ఉండాలని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలి అంటే ఫస్ట్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్ నాయకుడి చెవికి చేరాలి. అయితే వైసీపీలో ఆ పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. ఎన్నో అంచెలను వైసీపీలో ఏర్పాటు చేశారు. వాటిని దాటుకుని జగన్ ని చేరడం కష్టం అవుతోంది అని అంటున్నారు. అధికారంలో ఉన్నపుడు కూడా జగన్ అపాయింట్మెంట్ చాలా మంది పెద్దలకే దొరకడం కష్టంగా మారింది అని చెబుతారు. ఇప్పుడు ఓడిన తరువాత కూడా అంతే అన్నట్లుగా ఉందని గుర్తు చేస్తున్నారు.

**పార్టీని నమ్ముకుని :**

ఒక రాజకీయ పార్టీని ఎవరైనా స్థాపించవచ్చు. అయితే ఆ పార్టీని నమ్ముకుని ఎంతో మంది చేరుతారు. వారి ఆకాంక్షలు అన్నీ కూడా పార్టీ అధినాయకత్వం పార్టీ నడిపే తీరుని బట్టే నెరవేరే అవకాశం ఉంది. అందరి అభిప్రాయాలను తెలుసుకుంటూ ఆమోదయోగ్యమైన తీరులో పార్టీని నడిపితేనే మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు. పార్టీ తీరుని మార్చుకునేందుకు నిరంతరం సమీక్షలు కూడా అవసరం అని అంటున్నారు. ఇదిలా ఉంటే వర్గ పోరు ప్రతీ జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో ఉంది. దాంతో వైసీపీ బలంగా ఉన్న చోట కూడా వీక్ అయిపోతోంది అని అంటున్నారు.

**అధినాయకత్వం జోక్యంతో :**

శ్రీకాకుళం జిల్లాలో చూస్తే ధర్మాన సోదరులే జిల్లా పార్టీ మీద మొత్తం పెత్తనం చేస్తున్నారు అని తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్ ఆరోపిస్తున్నారు. ఈ ధోరణి మంచిది కాదని ఆయన అంటున్నారు. ఇలా రెండు కీలక వర్గాలు రెండు సామాజిక వర్గాల మధ్య వైసీపీ జిల్లాలో చీలిపోయి అవస్థలు పడుతోంది. వైసీపీ అధినాయకత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది కదా అని అంటున్నారు.విజయనగరం జిల్లాలో కూడా అసంతృప్తి తారస్థాయికి చేరిన మీదటనే చిన్న శ్రీను పార్టీని వీడారని గుర్తు చేస్తున్నారు. ఇపుడు శ్రీకాకుళంతో పాటు అనేక జిల్లాలలో ఇదే రకమైన వాతావరణం ఉందని అంటున్నారు.

**రాజకీయమే చేయాలి :**

రాజకీయం అనేది ఒక క్రీడ. ఇక్కడ ఎవరికి నచ్చినట్లుగా వారు ఆడడానికి లేదు. ఈ ఆటకు సిద్ధపడితే ప్రత్యర్థి వ్యూహాలను ఎత్తులను గమనించి దానికి తగినట్లుగా పై ఎత్తులు వేయాలి. అంతే స్థాయిలో రాజకీయం చేయాలి. అలా కాదు అని మడి కట్టుకుని కూర్చుంటే రాజకీయం ఎప్పటికీ పండదని అంటున్నారు. తాజాగా మాజీ మంత్రి కొడాలి నాని కూడా జగన్ విషయంలో మాట్లాడుతూ ఆయన రాజకీయ నాయకుడు కారు అనేశారు. తన తండ్రి ఆశయ సాధన కోసం పార్టీ పెట్టుకుని నడుపుతున్నారని చెప్పారు. అలా అనుకుంటే వైసీపీ రాజకీయ క్షేత్రంలో ప్రత్యర్థి వేసే ఎత్తులకు చిత్తు అవుతూనే ఉంటుంది అన్నది కూడా సీనియర్ల మాటగా ఉంది. జగన్ తీరు మారాలని అంటున్నారు. ముల్లుని ముల్లుతోనే కోయాలి అన్నట్లుగా ఏపీలో రాజకీయానికి తగిన విధంగా వైసీపీ కూడా ధీటుగా స్పందించాలని కోరుతున్నారు.

# కాంగ్రెస్ కు లైఫ్ వచ్చేనా

**విజయవాడ సెప్టెంబర్ 16, పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో మరోసారి అధిష్ఠానం ఇన్‌ఛార్జ్ ల మార్పు ప్రక్రియను పూర్తి చేసింది. శరవేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ, మాణిక్యం ఠాగూర్ స్థానంలో కర్ణాటకకు చెందిన సీనియర్ నేత పీసీ మోహన్‌ను ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా ఏఐసీసీ నియమించింది. అయితే, 2014 రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ ఘోరంగా పడిపోయిన విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పునాదులు కదిలిపోయిన చోట కేవలం పర్యవేక్షకులను, ఇన్‌ఛార్జ్‌లను మార్చడం వల్ల పార్టీకి కొత్త ఊపిరి వస్తుందా అంటే.. ప్రయోజనం శూన్యమనే సమాధానమే వస్తోంది. ఏపీ విభజనకు ముందు కాంగ్రెస్ పార్టీకి అత్యంత బలమైన కోర్ ఓట్ బ్యాంక్ ఉండేది. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలు , దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమానులు కాంగ్రెస్‌కు వెన్నెముకగా నిలిచారు. కానీ, విభజన పర్యవసానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా.. ఆ సాంప్రదాయ ఓటు బ్యాంక్ మొత్తాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలోకి మళ్లించుకుంది. గత పదేళ్లుగా వైఎస్సార్‌సీపీకి అదే ప్రధానమైన బలంగా మారింది. కాంగ్రెస్ పునర్వైభవం సాధించాలంటే ఆ కోల్పోయిన పునాదిని మళ్లీ దక్కించుకోవడం ఒక్కటే మార్గం, కానీ ఆ దిశగా పార్టీ కేంద్ర నాయకత్వం సీరియస్ ప్రయత్నాలు చేయడంలో పూర్తిగా విఫలమవుతోందనే విమర్శలు ఉన్నాయి.రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి స్పష్టమైన క్షేత్రస్థాయి వ్యూహం లేకపోవడమే అతిపెద్ద బలహీనత. కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు లేదా అసెంబ్లీ వేళల్లో ప్రెస్ మీట్లు పెట్టడం, సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేయడానికే రాష్ట్ర నాయకత్వం పరిమితమవుతోంది. వైఎస్ షర్మిలకు ఏపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన తర్వాత కొంతవరకు మీడియా మైలేజ్, క్యాడర్‌లో కొంత చలనం వచ్చినా.. అది ఓట్ల రూపంలోకి లేదా వైఎస్సార్‌సీపీ కోర్ ఓటు బ్యాంకును ఆకర్షించే స్థాయిలోకి మారలేదు. అసలైన జనాకర్షక నేతలు, క్షేత్రస్థాయిలో బలం ఉన్న స్థానిక నాయకత్వం లేకపోవడం వల్ల పార్టీ విస్తరణ ఆగిపోయింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు, రాష్ట్ర స్థాయిలో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఓటు బ్యాంకు స్వరూపం ఒకటే. కానీ ఏపీలో వైఎస్ఆర్‌సీపీని విమర్శించే క్రమంలో కాంగ్రెస్ పార్టీ టీడీపీ-బీజేపీ-జనసేన కూటమికి అనుకూలంగా ఉందనే భావన సాధారణ ప్రజల్లోకి వెళ్తోంది. ప్రత్యేకించి బీజేపీతో టీడీపీ పొత్తులో ఉన్న తరుణంలో, బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్‌కు మంచి అవకాశం ఉన్నప్పటికీ, కూటమి వైఫల్యాలపై ధ్వజమెత్తడంలో కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉండటం లేదనే విమర్శ ఉంది. ఈ వ్యూహాత్మక అయోమయం వల్ల మైనారిటీ, దళిత వర్గాలు కాంగ్రెస్ వైపు చూడటానికి వెనుకాడుతున్నాయి.కర్ణాటకకు చెందిన పీసీ మోహన్ నాయకత్వంలోనైనా ఏపీ కాంగ్రెస్ రూట్ మ్యాప్ మారుతుందా అన్నది ఇప్పుడు సవాలు. కర్ణాటకలో కాంగ్రెస్ సాధించిన విజయం, అక్కడ అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాల మోడల్‌ను ఏపీ ప్రజల్లోకి తీసుకెళ్లడం మోహన్‌కు కొంతవరకు కలసివచ్చే అంశం. అయితే, కేవలం విజయవాడ లేదా అమరావతిలోని పార్టీ కార్యాలయాల్లో సమీక్షలు నిర్వహించడానికే ప్రాధాన్యత ఇస్తే ఎలాంటి ఫలితం ఉండదు. బూత్ స్థాయి నుంచి కమిటీలను పునర్నిర్మించడం, కూటమి ప్రభుత్వం , ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ రెండింటికీ సమదూరం పాటిస్తూ సొంత అజెండాతో ప్రజల్లోకి వెళ్లడం తక్షణ అవసరం. రూట్ లెవల్‌లో నాయకత్వాన్ని తయారు చేయకుండా, డివైడ్ అయిన సాంప్రదాయ ఓటు బ్యాంకును ఆకట్టుకునేలా స్పష్టమైన ఆర్థిక-సామాజిక విధాన ప్రకటనలు చేయకుండా.. ఇన్‌ఛార్జ్‌లను ఎంతమందిని మార్చినా ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మిగిలిపోతుంది. కొత్తగా వచ్చిన పీసీ మోహన్ అయినా కేవలం ఢిల్లీ మార్గదర్శకాలను అమలు చేసే ప్రతినిధిగా మిగలకుండా, ఏపీ కాంగ్రెస్‌కు కొత్త శ్వాస ఊదేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

## అడ్డగోలు విద్యా సంస్థలపై యాక్షన్ షురూ

**గుంటూరు, సెప్టెంబర్ 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులను పావులుగా వాడుకుంటూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్న కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పి, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన సంస్థలు రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను రోడ్లపైకి ఎక్కించి ఆందోళనలు, నిరసనలు చేయిస్తుండటంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇలాంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడుతున్న నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.పోటీ పరీక్షల అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇప్పటికే తెచ్చిన ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026 , జీవో నెంబర్ 9 మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి ప్రైవేటు కోచింగ్ సెంటర్ నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలను బేఖాతరు చేస్తూ కొన్ని సంస్థల యజమానులు తెరవెనుక రాజకీయ వ్యవహారాలు నడుపుతున్నట్లు నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. సంస్థలలో చేరిన అభ్యర్థులపై మానసిక ఒత్తిడి తెచ్చి, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేలా ప్రేరేపిస్తున్నారని సీఎం దృష్టికి వచ్చింది.కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థులను ఉద్దేశపూర్వకంగా ఆందోళనలకు పురిగొల్పుతున్నారని ప్రభుత్వం తేల్చింది. కెరీర్ నిర్మించుకోవాల్సిన అమూల్యమైన సమయంలో విద్యార్థులను రాజకీయ ప్రేరేపిత నిరసనల్లో భాగస్వాములను చేయడం తీవ్రమైన నేరమని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే సంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉందని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అయితే ప్రైవేటు కోచింగ్ సెంటర్ల ముసుగులో రాజకీయ కుట్రలు పన్నుతూ వ్యవస్థలను అస్థిరపరచాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. నిబంధనల పరిధిలోనే సంస్థలు కార్యకలాపాలు సాగించాలని, విద్యా వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించింది.

## లోకల్ ఎన్నికల కోసం రిజర్వేషన్ వివాదం

**తిరుపతి, సెప్టెంబర్ 16, పెన్ పవర్:** జీవో జారీ చేసినా ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలు జరగవు.. బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లను కోర్టు కొట్టేస్తుంది, ఆ తర్వాత నెపాన్ని న్యాయస్థానాలపైకి నెట్టి ప్రభుత్వం నాటకాడుతుంది అని వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపణలు గుప్పిస్తున్నారు. మరోవైపు, ఎన్ని న్యాయపరమైన అడ్డంకులు వచ్చినా బీసీలకు 34 శాతం కోటా అమలు చేసి తీరుతాం అని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తూ 'జయహో బీసీ' సభల ద్వారా తమ బీసీ ఓటు బ్యాంక్‌ను పటిష్టం చేసుకునే పనిలో పడింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ వివాదం ఏమిటి? చంద్రబాబు సవాలు వెనుక ఉన్న రాజకీయ వ్యూహమేంటి? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పుల్లో.. ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్ల మొత్తం శాతాన్ని 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టమైన గీత గీసింది. ప్రస్తుతం ఏపీలో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6% రిజర్వేషన్లు ఉన్నందున, బీసీలకు 34% ఇస్తే మొత్తం రిజర్వేషన్లు 55% నుండి 61% వరకు చేరుకుంటాయి. 2019లో కూడా అప్పటి ప్రభుత్వం 34% ఇస్తే హైకోర్టు , సుప్రీంకోర్టులు దాన్ని కొట్టివేశాయి. దీనివల్ల రిజర్వేషన్లు 50% దాటితే న్యాయపరంగా మళ్లీ చిక్కులు వస్తాయన్నది జగన్ వాదనకు ప్రాతిపదిక.చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడైన నాయకుడు. కోర్టు తీర్పుల పరిమితి ఆయనకు తెలియనిది కాదు. అయినా 34% జీవో ఇవ్వడం వెనుక మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు 34% రిజర్వేషన్లు ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. ప్రభుత్వం తమ వైపు నుంచి 34% అమలుకు సిద్ధపడింది అన్న సందేశాన్ని ప్రజలకు ఇవ్వడం. ఒకవేళ కోర్టు దీనిని అడ్డుకుంటే, మేము ఇవ్వాలనుకున్నాం కానీ న్యాయస్థానాల పరిమితుల వల్ల కుదరలేదు అని చెప్పి బీసీల్లో సానుభూతి సాధించడం. సీలు టీడీపీకి సాంప్రదాయ వెన్నెముక. జీవో ఇవ్వడం, సభలు నిర్వహించడం ద్వారా తమ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని బలంగా స్థాపించడంవైఎస్ జగన్ విమర్శలు కేవలం న్యాయ సూత్రాల గురించే కావు. దాని వెనుక స్పష్టమైన ప్రతిపక్ష వ్యూహం దాగి ఉంది. 2019-2024 మధ్య వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 50% పరిమితికి లోబడి బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి ఎన్నికలు నిర్వహించింది. అప్పట్లో టీడీపీ దీనిని బీసీల నోళ్లు కొట్టారు అని విమర్శించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 34% జీవో ఇస్తే, తాము గతంలో చేసింది కోర్టు నిబంధనల కోసమేనని నిరూపించుకోవాల్సిన అవసరం జగన్‌కు వచ్చింది. అలాగే, రిజర్వేషన్ల వివాదం వల్ల ఎన్నికలు ఆలస్యమైతే, కూటమి ప్రభుత్వం ఎన్నికల నుంచి పారిపోతోందని ప్రజల్లోకి తీసుకెళ్లాలనేది వైఎస్ఆర్‌సీపీ ఆలోచన.న్యాయ కోణం నుంచి చూస్తే, ఎంపిక చేసిన ప్రాతిపదికన ఎంపిరికల్ డేటా అంటే సామాజిక, ఆర్థిక సర్వే డేటా ఆధారంగా బీసీల వెనుకబాటుతనాన్ని నిరూపిస్తే తప్ప 50% సీలింగ్ దాటడం సాధ్యం కాదు. ఈ విషయంపై ఏపీ హైకోర్టు కూడా ప్రభుత్వం వైపు నుంచి ఆధారాలను, ఎంపిరికల్ డేటాను కోరింది. ప్రత్యేక కమిషన్ల నివేదికలు లేకుండా జీవో ఆధారంగా 50% మించి రిజర్వేషన్లు ఇస్తే, గతం తరహాలోనే న్యాయస్థానాలు దానిని నిలిపివేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏపీ స్థానిక పోరులో బీసీ రిజర్వేషన్ల అంశం చట్టపరమైన సవాలు కంటే రాజకీయ అస్త్రంగా ఎక్కువ ఉపయోగపడుతోంది. 34% కోటాను దక్కించుకోవడం ద్వారా బీసీల గుండెల్లో చెరగని ముద్ర వేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తుంటే.. ఇది సాధ్యం కాని రాజకీయ గిమ్మిక్ అని తేల్చిచెప్పడం ద్వారా టీడీపీ-బీజేపీ-జనసేనల ఇమేజ్‌ను దెబ్బతీయాలని వైఎస్ఆర్‌సీపీ చూస్తోంది. అంతిమంగా, కోర్టు ఇచ్చే తీర్పు స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను నిర్ణయించడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో బీసీ ఓటు బ్యాంక్ ఎటువైపు మొగ్గుతుందో స్పష్టం చేయనుంది.

## ఆరోపణలు... ప్రత్యారోపణలు డీఎస్సీకి కథ ముగింపు ఎప్పుడు

**విజయవాడ సెప్టెంబర్ 16, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం ఎంత ఓపికగా, పారదర్శకంగా వివరణలిస్తున్న కొద్దీ.. వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి వర్గం ఉద్దేశపూర్వకంగానే నిరాధార ఆరోపణల రాళ్లు విసురుతోంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రతి సమాచారానికి వాస్తవాలతో కూడిన రివర్స్ కౌంటర్లు వస్తున్నాయని, తాము లేవనెత్తుతున్న అంశాలన్నీ గాల్లో దీపాలేనని ఆ పార్టీ నాయకులకు కూడా బాగా తెలుసు. అయినప్పటికీ ప్రజల్లో ఏదో ఒక అభూతకల్పనను నిరంతరం సజీవంగా ఉంచాలనే దుర్బుద్ధితో జగన్ రెడ్డి అండ్ కో ఈ తప్పుడు ప్రచారాలను నిరంతరం కొనసాగిస్తూనే ఉంది. కేవలం తమ అబద్ధాలను పదే పదే ప్రచారం చేసుకుంటూ కాలం వెళ్లదీయడమే లక్ష్యం.ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోతే తాము ఆడే డ్రామాలే నిజమని జనం నమ్ముతారనే భయంతో, ప్రభుత్వం ప్రతి చిన్న అంశానికీ ఆధారాలతో సహా వివరంగా సమాధానమిస్తోంది. అయితే దీన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న వైసీపీ, అదే అలుసుగా తీసుకుని ప్రతి దానిని డీఎస్సీ స్కాం అంటూ ప్రజల మైండ్‌లో రుద్దడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. ప్రజా సమస్యలపై సద్విమర్శలు చేయడం మానేసి, కేవలం నిరుద్యోగుల ఆశలతో ఆడుకునేలా నిత్యం ఏదో ఒక వివాదాన్ని రగిలించడమే ఏకైక అజెండాగా మార్చుకుంది.ఈ కుట్రపూరిత ప్రచారంలో భాగంగా మొదట పేపర్ లీక్ అంటూ నానా హంగామా సృష్టించారు; కానీ అది ఎక్కడా నిలవకపోవడంతో వెంటనే యూటర్న్ తీసుకుని ఒకే కులానికి చెందినవారికి ఉద్యోగాలొచ్చాయంటూ' విషం చిమ్మారు. ఆ విమర్శ కూడా పటాపంచలు కావడంతో, ఇప్పుడు ఏకంగా స్పోర్ట్స్ కోటా అంశాన్ని పట్టుకుని వేలాడుతున్నారు. అసలు ఖోఖో కూడా ఒక ఆట కింద లెక్కేనా అంటూ జగన్ రెడ్డి స్వయంగా ఎద్దేవా చేయడం, క్రీడాకారుల ప్రతిభను కించపరిచేలా మాట్లాడటం చూస్తుంటే.. వినేవాళ్లు నవాబుల కాలం నాటి ఈ జోకులను ఎందుకు సీరియస్‌గా తీసుకోవాలో అర్థం కాని దుస్థితి ఏర్పడింది. కేవలం తమ రాజకీయ మనుగడ కోసం రాష్ట్రంలోని క్రీడాకారుల భవిష్యత్తును, పారదర్శకంగా భర్తీయవుతున్న ఉపాధ్యాయ నియామకాలను బలిపెట్టడానికి కూడా ఆ పార్టీ వెనుకాడటం లేదు.వైసీపీ ఆడుతున్న ఈ విషపూరిత డ్రామాలు, పన్నే ప్లాన్లకు ప్రభుత్వం ఇకనైనా పూర్తిస్థాయిలో చెక్ పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. రోజువారీ రాజకీయ మైలేజ్ కోసం చేస్తున్న ఈ ఆరోపణలను ఎక్కడికక్కడ చట్టపరంగా, కఠినంగా నిలువరించాల్సిన అవసరం ఉంది. కేవలం మీడియా చర్చలకు వదిలేయకుండా, కోర్టుల్లో ఏమాత్రం నిలవని, కేవలం బురదజల్లే ఈ నకిలీ డిబేట్లను తక్షణం న్యాయపరమైన చర్యలతో అడ్డుకోవాలి. లేదంటే ఈ అబద్ధాల ప్రచారమే నిజమనే భ్రమను కల్పించడంలో వారు సఫలమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తన పాలనా దక్షతను, పారదర్శకతను చాటుకుంటూనే.. వ్యవస్థలను అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్న ఈ పాత రాజకీయ శైలిని ఉక్కుపాదంతో అణచివేయాలి. నిరుద్యోగుల ఉసురుపోసుకునేలా రోజుకో డ్రామా ఆడుతున్న వైసీపీకి ప్రజాక్షేత్రంలోనూ, చట్టం ముందూ తగిన బుద్ధి చెప్పినప్పుడే ఇలాంటి నిరాధార రాళ్ల క్రీడలకు శాశ్వత బ్రేక్ పడుతుంది.

# జాతీయ గర్వం అహంకారంగా మారితే.. గెలుపుకు ప్రాధాన్యత ఉండదు:

## భారత్ ట్రోఫీ నిరాకరణపై మహమ్మద్ యూసఫ్

**ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు**

**నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ స్వీకరించేందుకు నిరాకరించిన టీమ్**

**వినయం లేని దేశం గెలిచినా ఓడిపోయినట్టే అన్న యూసఫ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్థాన్ మంత్రి మోహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించేందుకు నిరాకరించడం తీవ్ర దుమారం రేపుతోంది. గత ఏడాది పురుషుల ఆసియా కప్ సమయంలోనూ భారత పురుషుల జట్టు నఖ్వీ నుంచి ట్రోఫీని తీసుకోకుండా సంచలన నిర్ణయం తీసుకుంది. తాజాగా భారత మహిళల జట్టు కూడా అదే బాటలో పయనించి నఖ్వీకి షాక్ ఇచ్చింది.దుబాయ్‌లో జరిగిన ఫైనల్ పోరులో శ్రీలంకపై 72 పరుగుల తేడాతో విజయం సాధించి భారత మహిళల జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. అయితే నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోకూడదనే నిర్ణయం వెనుక బీసీసీఐ ముందస్తు వ్యూహం ఉంది.

ఈ ట్రోఫీ నిరాకరణ ఘటనపై పాకిస్థాన్ మాజీ దిగ్గజ క్రికెటర్ మహమ్మద్ యూసఫ్ సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించాడు. "జాతీయ గర్వం కాస్తా అహంకారంగా మారినప్పుడు, గెలుపునకు ఏమాత్రం ప్రాధాన్యత ఉండదు. జట్టు గెలవవచ్చు, కానీ వినయం లేని దేశం ఓడిపోయినట్టే" అని ట్వీట్ చేశాడు.మోహ్సిన్ నఖ్వీని ప్రశంసిస్తూ యూసఫ్ చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ట్రోఫీ తీసుకోకపోవడంపై బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా స్పందిస్తూ ఇది బోర్డు తీసుకున్న సంస్థాగత నిర్ణయమని స్పష్టం చేశారు. వేడుకల్లో పాల్గొనకూడదనే విషయాన్ని ఏసీసీకి ముందే అధికారికంగా తెలియజేశామని ఆయన వెల్లడించారు. గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి, ఆ తర్వాత చోటుచేసుకున్న సైనిక ఉద్రిక్తతల దృష్ట్యా దేశప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇది ఆటగాళ్లకు లేదా క్రీడకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలోని వ్యూహాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.

# ఫ్రాంచైజీల విజ్ఞప్తి.. ఇకపై ఇండియాలోనే ఐపీఎల్ మినీ వేలం

**స్వదేశానికి తిరిగి రానున్న ఐపీఎల్ మినీ వేలం**

**ఫ్రాంచైజీల విజ్ఞప్తితో పాలకమండలి నిర్ణయం**

**2024 నుంచి దుబాయ్, జెడ్డా వంటి నగరాల్లో వేలం**

**వేదికపై ఇంకా రాని స్పష్టత**

**ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌పై కొనసాగుతున్న చర్చ**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మినీ వేలాన్ని తిరిగి భారత్‌లోనే నిర్వహించాలని ఐపీఎల్ పాలకమండలి (జీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్నేళ్లుగా విదేశాల్లో నిర్వహిస్తున్న ఈ సంప్రదాయానికి స్వస్తి పలకాలని మంగళవారం జరిగిన పాలకమండలి సమావేశంలో తీర్మానించారు. 2024 నుంచి ఐపీఎల్ వేలాన్ని దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే, మినీ వేలం కోసం తమ బృందాలను విదేశాలకు తరలించడం రవాణా పరంగా, నిర్వహణాపరంగా సవాలుగా మారుతోందని ఫ్రాంచైజీలు ఆందోళన వ్యక్తం చేశాయి. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న గవర్నింగ్ కౌన్సిల్, 2027 మినీ వేలాన్ని భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, వేలం నిర్వహించే నగరాన్ని ఇంకా ఖరారు చేయలేదు. పెళ్లిళ్ల సీజన్ దృష్ట్యా హోటల్ గదుల లభ్యతను బట్టి వేదికను ఖరారు చేయనున్నారు. మినీ వేలాన్ని భారత్‌కు మార్చినప్పటికీ, ఆ తర్వాతి ఏడాది జరిగే మెగా వేలాన్ని మాత్రం విదేశాల్లోనే నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఇదే సమావేశంలో 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనపై కూడా పాలకమండలి సుదీర్ఘంగా చర్చించింది. ఈ నిబంధనపై ఫ్రాంచైజీల నుంచి అభిప్రాయాలను స్వీకరించి, తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనుంది.

# 2027 ప్రపంచకప్ గెలవాలంటే ఆ తప్పులు చేయొద్దు.. టీమిండియాకు యువరాజ్ కీలక సలహా



**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా చేసుకుని భారత జట్టు యాజమాన్యానికి మాజీ ఆల్-రౌండర్, 2011 ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్ కీలకమైన సలహాలు ఇచ్చాడు. టోర్నమెంట్‌కు ముందు చివరి నిమిషంలో జట్టులో భారీ మార్పులు చేయడం మానుకోవాలని, ఇప్పటి నుంచే ఒక కోర్ జట్టును గుర్తించి వారిపై నమ్మకం ఉంచాలని సూచించాడు. దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళితేనే విజయం సాధ్యమవుతుందని స్పష్టం చేశాడు.క్రిక్‌ఇన్ఫోతో మాట్లాడుతూ యువరాజ్ సింగ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. "భారత జట్టు కీలక టోర్నీలలో విఫలమైన ప్రతీసారి, దానికి కారణం చివరి నిమిషంలో భారీ మార్పులు చేయడమే. కాబట్టి 2027 ప్రపంచకప్ గెలవగలదని మనం నమ్మే జట్టును ఎంచుకుని, టోర్నీ వరకు వారికే అండగా నిలవడం చాలా ముఖ్యం. వారు గెలిచినా, ఓడినా జట్టుపై నమ్మకం ఉంచాలి" అని యువరాజ్ వివరించాడు.ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న తరుణంలో 50 ఓవర్ల మ్యాచ్‌ల సంఖ్య తగ్గిపోయిందని యువీ గుర్తుచేశాడు. అందువల్ల ఎంపిక చేసిన ఆటగాళ్లకు తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించాలంటే, రాబోయే ఏడాది కాలంలో వారికే స్థిరంగా అవకాశాలు కల్పించాలని అన్నాడు. 12 నుంచి 14 మందితో కూడిన అత్యుత్తమ జట్టును ఎంపిక చేసుకుని, మైదానం, పరిస్థితులకు అనుగుణంగా తుది జట్టులో ఒకటి రెండు మార్పులు చేయవచ్చని తెలిపాడు.గతంలో ఆస్ట్రేలియా జట్టు ప్రపంచకప్‌లు గెలవడానికి కారణం వారి జట్టులో మ్యాచ్ విన్నర్లు ఉండటమేనని యువరాజ్ ఉదహరించాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించగల సత్తా ఉన్న ఆటగాళ్లను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని సూచించాడు.

ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు కూడా ఇదే విధానాన్ని అనుసరించిందని, స్థిరమైన జట్టుతో బరిలోకి దిగడం వల్లే విజయం సాధ్యమైందని యువీ విశ్లేషించాడు. 2027 ప్రపంచకప్ కోసం కూడా ఇదే తరహా వ్యూహంతో ముందుకు సాగాలని జట్టు యాజమాన్యానికి సలహా ఇచ్చాడు.

# ట్రెండీ టాక్: 50 ప్లస్ హీరోలకు 'ఇరుముడి' నేర్పిన పాఠం







సినిమా రంగంలో స్టార్ హీరోల వయసు మారుతున్న కొద్దీ వారి పాత్రల ఎంపికలోనూ పరిణతి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మరోసారి ప్రూవ్ అయింది. తమ వయసుకు తగిన పాత్రలు చేస్తేనే ఎంత పెద్ద హీరోనైనా ప్రేక్షకులు తెరపై ఆదరిస్తారని.. లేదంటే ప్రేక్షకుల నుంచి ఘోరమైన తిరస్కారం తప్పదని గత పరిణామాలు స్పష్టం చేసాయి. రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు బిగ్ డిబేట్ కి కారకం. పెళ్లీడుకొచ్చిన కూతుళ్లు ఉన్నప్పటికీ ఇంకా యువ హీరోయిన్లతో రొమాంటిక్ లవ్‌స్టోరీల్లో నటిస్తున్న 60 ప్లస్ హీరోలకు ఇదొక పెద్ద కనువిప్పు లాంటి పరిణామం. మన పరిశ్రమలో ఉన్న 50 ప్లస్ హీరోలు ఇకపై రొమాంటిక్ పాత్రలను పక్కన పెట్టి.. కథకు బలమైన డాడీ పాత్రల్లో.. బాధ్యతాయుతమైన రోల్స్‌లో నటించాల్సిన సమయం ఆసన్నమైంది.ఇప్పటివరకు ఇద్దరేసి హీరోయిన్లతో ప్రేమలో నిండా మునిగి, రొమాన్స్ చేయడంలో బిజీగా ఉన్న మాస్ మహారాజా రవితేజ ఇటీవల -ఇరుముడి- చిత్రంలో మొదటిసారి కూతురిని అమితంగా ప్రేమించే బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో నటించారు. తెరపై ఆయనలోని ఈ విప్లవాత్మక మార్పును ప్రేక్షకులు ఎంతో మనసారా స్వాగతించారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథా బలం ఉన్న తండ్రి పాత్రను ఎంచుకోవడం వల్ల ఆ సినిమా ఘనవిజయం సాధించడమే కాకుండా.. నటుడిగా అతడి మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది.ఈ విజయంతో 50 ప్లస్, 60 ప్లస్ హీరోలందరూ ఇకపై తమ వయసుకు తగిన పాత్రలనే ఎంచుకోవాల్సి ఉంటుందనే సూచన స్పష్టంగా కనిపిస్తోంది. ఇండస్ట్రీ దిగ్గజ హీరోలైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్‌లు ఇప్పటికే చాలావరకు తమ వయసుకు తగినట్లు పరిణతి ఉన్న విభిన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ దూసుకెళుతున్నారు. నాగార్జున సైతం ప్రయోగాత్మక కంటెంట్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. 'ఇరుముడి' తరహాలో భావోద్వేగాలతో కూడిన తండ్రి పాత్రలు ఈ సీనియర్ హీరోలందరికీ కూడా వందశాతం సూటబుల్ ఆప్షన్‌గా మారుతున్నాయి.

అలా కాకుండా పాత పద్ధతిలోనే ఇంకా హీరోయిన్లతో లవ్వాయణాలు, రొమాంటిక్ కామెడీలు చేస్తూ పోతే నేటి ప్రేక్షకులు నిర్ధయంగా తిరస్కరిస్తున్న ఉదాహరణలు చూస్తూనే ఉన్నాం. నేటి మాస్ ఫ్యాన్స్ కూడా ఓటీటీలు, వెబ్ సిరీస్‌లు, హాలీవుడ్ సినిమాలు, లైవ్ సిరీస్ లు విపరీతంగా చూస్తూ పూర్తిగా అప్‌గ్రేడ్ అయ్యారు. వారి అభిరుచులు మారడంతో రొటీన్ కమర్షియల్ ఫార్ములా సినిమాలు బెడిసికొడుతున్నాయి. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, షారూఖ్ ఖాన్ వంటి దిగ్గజాలు కూడా గ్లామర్ పాత్రలను పక్కన పెట్టి తమ వయసుకు తగ్గ పరిణతి ఉన్న తండ్రి లాగానో లేదా వయసుకు తగ్గ పాత్రల్లోను నటిస్తుండటం గమనార్హం.మొత్తానికి ఏజ్ పెరుగుతున్న కొద్దీ స్టార్ హీరోలు తమ పంథాను మార్చుకోవాల్సిన టైమ్ వచ్చేసింది. హాలీవుడ్ హీరోల మాదిరిగా మారుతున్న కాలానికి తగినట్లు తమ ఇమేజ్‌ను అప్‌గ్రేడ్ చేసుకుంటూ.. వైవిధ్యమైన పాత్రలతో మైలేజ్ పెంచుకోవడమే సీనియర్ హీరోలకు సరైన మార్గం. కేవలం డ్యాన్సులు, రొమాన్స్ చుట్టూ తిరగకుండా బలమైన భావోద్వేగాలు ఉన్న క్యారెక్టర్లను ఎంచుకుంటేనే బాక్సాఫీస్ వద్ద విజయం సొంతమవుతుందని నిరూపణ అయింది. ఇరుముడి నేర్పిన పాఠం టాలీవుడ్ 50 ప్లస్ హీరోలకు నిజంగానే కలిసి వస్తుందని ఆశిద్దాం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com